RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18 | సంచిక : 98 | Vol : 18 | Issue : 98

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

కరీంనగర్, బుధవారం 10 జూన్ 2026
Karimnagar, Wednesday 10 June 2026

పేజీలు : 08 | వెల రూ : 4-00

Pages : 08 | Price : 4-00



WANTED

పీపుల్స్‌డైరీ దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సెంటర్లు

◆ హనుమకొండ ◆ కరీంనగర్ ◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం ◆ జనగామ ◆ మహబూబాబాద్ ◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్

Cell : 9493019044
9618509859


## తెలంగాణకు భారీ వర్ష సూచన..



**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు మంగళవారం ప్రవేశించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ నైరుతి రుతుపవనాల రాకతో.. రాష్ట్రవ్యాప్తంగా గత కొన్ని రోజులుగా భీకరమైన ఎండలు, ఉక్కపోత, వేడితో అల్లాడిపోతున్న ప్రజలను.. చిరు జల్లులు పలకరిస్తున్నాయి. జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలోనే హైదరా బాద్ వాతావరణ కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఇవాళ, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. హైదరాబాద్ నగరంలో సాయంత్రం నుంచి రాత్రి వరకు పలు ప్రాంతాల్లో వర్షం పడే సూచనలు ఉన్నాయని పేర్కొంది.

జోగులాంబ గద్వాల జిల్లా ద్వారా నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించాయి. నైరుతి రాకతో జోగులాంబ గద్వాల జిల్లాతోపాటు దాని పరిసర ప్రాంతాల్లో వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఆకాశంలో మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలోనే మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసింది. రాబోయే 2 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడనున్నాయని పేర్కొంది.

(మిగతా 2లో...)



## శాంతిమంత్రానికి వీడ్కోలు..!

వేగంగా భారత్ అణు సన్నద్ధత ప్రక్రియ!

- యుద్ధ విధానంలో అనూహ్య మార్పు
- పాత విధానాలకు భిన్నంగా దేశం రెడీ
- 12 అణు వార్ హెడ్స్ మోహరించిన భారత్?
- వెలువడిన షాకింగ్ రిపోర్ట్..!

**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** అణ్వాయుధాల్ని శత్రువులపై ముందుగా ప్రయోగించకూడదనేది భారత్ కొన్ని దశాబ్దాలుగా అనుసరిస్తున్న సిద్ధాంతం. కానీ ఇప్పుడు దానికి తిలోదకాలు ఇచ్చేందుకు రంగం సిద్ధమవుతుందా అన్న చర్చ మొదలైంది. దీనికి ప్రధాన కారణం తాజాగా భారత్ తమకున్న 190 అణు వార్ హెడ్లలో 12 వార్ హెడ్లను మోహరించినట్లు ఓ నివేదిక వెలువడింది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఐపీఆర్ఐ) విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం.. భారత్ తొలిసారి 12 అణు వార్‌హెడ్లను మోహరించింది.

దశాబ్దాలుగా పాటిస్తున్న పాత విధానానికి భిన్నంగా, అణు వార్‌హెడ్లను, వాటిని ప్రయోగించే క్షిపణి వ్యవస్థలను వేర్వేరుగా ఉంచే పద్ధతిని వది లేసి, వాటిని సిద్ధంగా ఉంచే ప్రక్రియను భారత్ మొద లుపెట్టినట్లు

(మిగతా 2లో...)

## విద్యార్థులపైనా యుద్ధం ఎఫెక్ట్

- భారీగా పెరుగనున్న ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు
- పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో భారం
- తల్లిదండ్రుల జేబులకు చిల్లు

2వ పేజీలో..

## హైదరాబాద్‌లో నేపాలీ గ్యాంగ్ మరో ఘాతుకం..

- వ్యాపారి ఇంట్లో కిలో బంగారం, వజ్రాల దోపిడీ..!
- గచ్చిబౌలి విల్లాలో భారీ దోపిడీ

## 50 ఏండ్లు



## డ్రైవింగ్ లైసెన్స్ వాలిడిటీ పెంపు!?

- డిజిటలైజ్ దిశగా మరికొన్ని కీలక సేవలు
- కేంద్రం సరికొత్త రూల్స్!
- మారనున్న పాత పద్ధతులు

**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న కోట్ల మంది వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం త్వరలోనే ఒక భారీ గుడ్ న్యూస్ చెప్పబోతోంది. లైసెన్స్ గడువు ముగిసిన ప్రతిసారీ రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలకు శాశ్వతంగా చెక్ పెట్టేలా రవాణా మంత్రిత్వ శాఖ ఒక సంచలన ప్రతిపాదనను పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఉన్న 20 ఏళ్ల డ్రైవింగ్ లైసెన్స్ వ్యాలిడిటీ (గడువు) కాలాన్ని ఏకంగా 50 ఏళ్లకు పెంచే యోచనలో కేంద్రం ఉన్నట్లు జాతీయ మీడియా కథనాలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ ప్రతిపాదన గనుక అమల్లోకి వస్తే, పౌరులకు మాటిమాటికీ లైసెన్స్ రీన్యూవల్ చేసుకునే అవస్థలు తప్పుతాయి. ప్రస్తుతం మంత్రిత్వ శాఖ పరిశీలనలో ఉన్న పలు కీలక సంస్కరణల్లో డ్రైవింగ్ లైసెన్స్ గడువును 50 ఏళ్లకు పొడిగించే ప్రతిపాదన కూడా ఒకటని అధికారులు ధృవీకరించారు. అయితే, దీనిపై ఇంకా ఎలాంటి తుది నిర్ణ యం తీసుకోలేదని, ప్రస్తుతం చర్చల దశలోనే ఉందని వారు స్పష్టం చేశారు.

ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం.. ఒకసారి డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుంటే అది 20 ఏళ్ల పాటు లేదా సదరు వ్యక్తికి 40 ఏళ్ల వయసు వచ్చే వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ఆ గడువు ముగిసిన తర్వాత వాహనదారులు మళ్లీ దరఖాస్తు చేసుకుని, అవసరమైన పత్రాలతో పాటు నిర్దేశిత

(మిగతా 2లో...)

## ఉపాధికోసం వెళ్లి కానరానిలోకాలకు..



ఏడుగురు భారతీయులు మృతి

- దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..
- మరో 9 మందికి తీవ్ర గాయాలు
- దుబాయ్ భారతీయ సమాజంలో విషాదం

**పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ :** దుబాయ్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం భారతీయులను విషాదంలో ముంచెత్తింది. ఆగి ఉన్న ట్రక్కును మినీ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొన్న ఈ ప్రమాదంలో ఏడుగురు భారతీయులు దుర్మరణం చెందగా, మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతులంతా ఉపాధి కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు వెళ్లిన కార్మికులేనని ప్రాథమిక సమాచారం. ఈ ఘటన దుబాయ్‌లోని ఎమిరేట్స్ రోడ్డుపై చోటుచేసుకోవడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. ఈ విషాద ఘటనపై దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. ప్రమాదంలో భారతీయులు ప్రాణాలు కోల్పోవడం

(మిగతా 2లో...)



## శాయంపేటలో దారుణ నిర్లక్ష్యం?

2వ పేజీలో..



## ట్యాంకులో కోతుల కళేబరాలు?

- రోజుల తరబడి అవే నీటిని తాగిన ప్రజలు!?
- ప్రజల ప్రాణాలంటే జీపీ పాలకవర్గానికి ఇంత నిర్లక్ష్యమా?
- దుర్వాసన వస్తోందని రోజుల తరబడి వేడుకున్నా పట్టించుకోని వైనం
- చివరకు వాటర్ ట్యాంకులో చనిపోయిన కోతులు బయటపడటంతో సంచలనం
- విషయం బయటకు పొక్కకుండా పాలకవర్గం చర్యలు
- రాష్ట్రవ్యాప్తంగా నిర్లక్ష్యం మారుమోగుతుందనే భయమా?

*ట్యాంకు పైకప్పుపై ఆడిన కోతులు అజాగ్రత్తకు బలైపోయాయి... వాటి ప్రాణాలు గాలిలో కలిసిపోయినా, వాటి కళేబరాలు మాత్రం నీళ్లలో మిగిలిపోయాయి. దుర్వాసనతో విలవిల్లాడిన వీధులు... "నీళ్లు బాగోలేవు" అని మొరపెట్టుకున్న జనాలు, అయినా కదలని పాలకవర్గం, వినిపించని ప్రజల ఆర్తనాదాలు... ఇంటింటికీ చేరిన ప్రతి బిందెలో ఒక దారుణ నిజం తేలియాడింది... తాగిన ప్రతి చుక్కలో నిర్లక్ష్యపు ముద్ర కనిపించింది. జనం వేదనకు కనీస విలువ లేదా? నమ్మకంతో ఓటేసి గెలిపించిన ప్రజలంటే ఇంత నిర్లక్ష్యమా...?*

- పీపుల్స్‌డైరీ-శాయంపేట

# శాయంపేటలో దారుణ నిర్లక్ష్యం?

- ట్యాంకులో కోతుల కళేబరాలు...
- రోజుల తరబడి అవే నీటిని తాగిన ప్రజలు!?
- ప్రజల ప్రాణాలంటే జీపీ పాలకవర్గానికి ఇంత నిర్లక్ష్యమా?
- దుర్వాసన వస్తోందని రోజుల తరబడి వేడుకున్నా పట్టించుకోని వైనం
- చివరకు వాటర్ ట్యాంకులో చనిపోయిన కోతులు బయటపడటంతో సంచలనం
- విషయం బయటకు పొక్కకుండా పాలకవర్గం చర్యలు
- రాష్ట్రవ్యాప్తంగా నిర్లక్ష్యం మారుమోగుతుందనే భయమా?

**ట్యాంకు పైకప్పుపై ఆడిన కోతులు అజాగ్రత్తకు బలైపోయాయి... వాటి ప్రాణాలు గాలిలో కలిసిపోయినా, వాటి కళేబరాలు మాత్రం నీళ్లలో మిగిలిపోయాయి. దుర్వాసనతో విలవిల్లాడిన వీధులు... "నీళ్లు బాగోలేవు" అని మొరపెట్టుకున్న జనాలు, అయినా కదలని పాలకవర్గం, వినిపించని ప్రజల ఆర్తనాదాలు... ఇంటింటికీ చేరిన ప్రతి బిందెలో ఒక దారుణ నిజం తెలియాడింది... తాగిన ప్రతి చుక్కలో నిర్లక్ష్యపు ముద్ర కనిపించింది. జనం వేదనకు కనీస విలువ లేదా? నమ్మకంతో ఓటేసి గెలిపించిన ప్రజలంటే ఇంత నిర్లక్ష్యమా...?**

**పీపుల్స్‌డైరీ–శాయంపేట :** శాయంపేట మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఒక దారున విషయాన్ని గ్రామపంచాయతీ పాలకవర్గం, అధికారులు కలిసి బయటి ప్రపంచానికి తెలియకుండా కప్పేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విషయం బయటకు పొక్కితే తమ దారుణ నిర్లక్ష్యం బయటపడుతుందనే భయంతో అందరూ కుమ్మక్కై చాలా సీక్రెట్ మెయింటన్ చేసినట్టు సమాచారం. చివరకు లోకల్ మీడియాను సైతం తమ గుప్పిట్లోకి తెచ్చుకున్నట్టు జనం మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే... ప్రజలకు సరఫరా చేసే తాగునీటి ట్యాంకులో కొన్ని కోతులు పడి మరణించినప్పటికీ, ఆ విషయాన్ని గుర్తించడంలో గ్రామపంచాయతీ సిబ్బంది, అధికారులు, పాలకవర్గం ఘోరంగా విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరింత విషాదకరమైన విషయం ఏమిటంటే, ట్యాంకులో కోతుల కళేబరాలు ఉండగానే అదే నీటిని రోజుల తరబడి ప్రజలకు సరఫరా చేయడం వల్ల దుర్వాసనతో వందలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు విశ్వసనీయ సమాచారం.

**దుర్వాసనపై ప్రజల ఫిర్యాదులు... కానీ స్పందన శూన్యం**

కొన్ని రోజులుగా ఇళ్లకు వచ్చే తాగునీటి నుంచి భరించలేని దుర్వాసన వస్తోందని ప్రజలు గ్రామపంచాయతీ కార్యాలయానికి పలుమార్లు ఫిర్యాదులు చేసినట్టు తెలుస్తోంది. నీరు తాగడానికి పనికిరావడం లేదని, వంటకు కూడా ఉపయోగించలేకపోతున్నామని ప్రజలు ఎంత మొత్తుకున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది సమస్యను సీరియస్‌గా తీసుకోలేదని ఆరోపిస్తున్నారు.

"నీటిలో ఏదో తేడా ఉంది.. భరించలేని వాసన వస్తోంది" అని ప్రజలు పదేపదే చెబుతున్నప్పటికీ, సమస్య మూలాన్ని తెలుసుకునే ప్రయత్నం కూడా చేయకపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ట్యాంకు తెరిచి చూడగానే షాక్**

దుర్వాసన రోజురోజుకు మరింత పెరగడంతో చివరకు ప్రజల ఒత్తిడికి తలొగ్గిన గ్రామపంచాయతీ పాలకవర్గం వాటర్ ట్యాంకును పరిశీలించినట్టు సమాచారం. అయితే అక్కడ కనిపించిన దృశ్యం అందరినీ ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురిచేసింది. ట్యాంకులో కొన్ని కోతులు పడి చనిపోయి ఉండటమే దుర్వాసనకు కారణమని గుర్తించిన అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా ఖంగుతిన్నారని చెబుతున్నారు.

కోతుల కళేబరాలు కుళ్లిపోతున్న సమయంలో అదే నీటిని ప్రజలకు సరఫరా చేయడం ఎంతటి ప్రమాదకర పరిణామాలకు దారితీసేదో ఊహించడానికే ప్రజలు భయపడుతున్నారు.

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా?**

తాగునీరు అనేది ప్రతి మనిషి జీవనాధారం. అలాంటి నీటిలో చనిపోయిన జంతువుల కళేబరాలు కలిసిన పరిస్థితుల్లో కూడా సరఫరా కొనసాగడం ప్రజల ఆరోగ్యాన్ని తీవ్ర ప్రమాదంలోకి నెట్టినట్టేనని ఆరోగ్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొన్ని రోజుల పాటు ఆ నీటినే తాగాల్సి రావడం వల్ల చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారిపై ఎలాంటి ప్రభావం పడిందో అనే ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. భవిష్యత్తులో ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**విషయం బయటకు రాకుండా ప్రయత్నాలా?**

ఈ ఘటన బయటకు వస్తే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో గ్రామపంచాయతీ పాలకవర్గం విషయం గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్యాంకులో కోతులు చనిపోయిన విషయం ప్రజలకు, మీడియాకు తెలియకుండా చర్యలు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా జరిగిన ఈ ఘటన గురించి సమాచారం బయటకు పొక్కకుండా కొందరు ప్రభావశీలులు ప్రయత్నించారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. దీంతో ప్రజల్లో మరింత అనుమానాలు పెరుగుతున్నాయి.

**అధికారులు కూడా చేతులు కలిపారా?**

ఈ విషయం మండల స్థాయి అధికారుల దృష్టికి వెళ్లడంతో వారు సంఘటనా స్థలాన్ని సందర్శించి తనిఖీలు నిర్వహించినట్టు సమాచారం. అయితే ఘటన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించకుండా, గ్రామపంచాయతీ పాలకవర్గంతో కలిసి కుమ్మక్కయ్యారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అత్యంత కీలకమైన అంశంలో పారదర్శకత లేకపోవడం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. ట్యాంకులో కోతులు ఎప్పుడు పడ్డాయి? ఎంతకాలం పాటు ఆ నీరు సరఫరా చేశారు? నీటి నమూనాలను పరీక్షలకు పంపించారా? ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారా? వంటి ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానాలు లేవని స్థానికులు చెబుతున్నారు.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలను వెంటనే సరిచేయడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**ప్రజల ప్రాణాల విలువ ఎక్కడ?**

ఒక చిన్న నిర్లక్ష్యం ఎంత పెద్ద ప్రమాదానికి దారితీస్తుందో శాయంపేట ఘటన స్పష్టంగా చూపిస్తోంది. ప్రజలు దుర్వాసన వస్తోందని రోజుల తరబడి హెచ్చరిస్తుంటే పట్టించుకోకపోవడం, సమస్యను ముందుగానే గుర్తించడంలో విఫలమవడం, అనంతరం విషయం బయటకు రాకుండా ప్రయత్నించారనే ఆరోపణలు ప్రజాస్వామ్య వ్యవస్థపైనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

ప్రజల ఆరోగ్యం, ప్రాణ భద్రత కంటే మరేదీ ముఖ్యమేమీ కాదు. అలాంటి బాధ్యతను నిర్వర్తించాల్సిన వారే నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు నిజమైతే అది క్షమించరాని తప్పు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని, ప్రజలకు సమాధానం చెప్పాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

శాయంపేట ప్రజలు ఎదుర్కొన్న ఈ చేదు అనుభవం తాగునీటి భద్రతపై అధికార యంత్రాంగం ఎంత అప్రమత్తంగా ఉండాలో మరోసారి గుర్తు చేస్తోంది.



## హైదరాబాద్‌లో నేపాలీ గ్యాంగ్ మరో ఘాతుకం..

- వ్యాపారి ఇంట్లో కిలో బంగారం, వజ్రాల దోపిడీ..!
- గచ్చిబౌలి విల్లాలో భారీ దోపిడీ

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో నేపాలీ ముఠా మరోసారి రెచ్చిపోయింది. నమ్మకంగా ఇళ్లల్లో చేరి సమయం చూసి యజమానుల ఆస్తులను దోచుకెళ్లే నేపాలీ గ్యాంగ్.. ఈసారి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక భారీ చోరీకి పాల్పడింది. గచ్చిబౌలిలోని హిల్ రిడ్జ్ విల్లాస్‌లో నివాసం ఉంటున్న ఒక ప్రముఖ వ్యాపారవేత్త ఇంట్లో ఈ దొంగతనం వెలుగుచూసింది. బాధితుడి ఇంట్లో నుంచి సుమారు ఒక కిలో బరువున్న బంగారు ఆభరణాలు, అత్యంత విలువైన వజ్రాలను ఈ ముఠా అపహరించుకుపోయింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించడమే కాకుండా.. విల్లా అసోసియేషన్లలో భద్రతపై పలు అనుమానాలను రేకెత్తిస్తోంది.

పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. ఈ విల్లాలో నివాసముంటున్న వ్యాపారవేత్త నెల రోజుల క్రితమే నేపాల్ దేశానికి చెందిన దంపతులను ఇంట్లో వివిధ పనుల నిమిత్తం పనిలో పెట్టుకున్నారు. వారి పూర్వాపరాలు, సరైన గుర్తింపు కార్డులు పరిశీలించకుండానే చేర్చుకున్నట్లు తెలుస్తోంది. కాగా.. కొద్దిరోజుల క్రితం వ్యాపారవేత్త తన కుటుంబంతో కలిసి వ్యక్తిగత పనిమీద ముంబై నగరానికి వెళ్లారు. ఇదే సమయం కోసం ఎదురుచూస్తున్న నేపాలీ దంపతులు తమ ప్లాన్ అమలు చేశారు. ఆదివారం రోజున యజమాని కుటుంబం ముంబై నుంచి తిరిగి హైదరాబాద్‌లోని తమ నివాసానికి చేరుకుంది. వారు వచ్చేసరికి ఇంట్లో పనిమనుషులుగా ఉన్న నేపాలీ దంపతులు ఎక్కడా కనిపించలేదు.

ఇంటి ప్రధాన ద్వారం తలుపులు గానీ, తాళాలు గానీ పగలగొట్టినట్లు ఎలాంటి ఆనవాళ్లు లేకపోవడంతో.. యజమాని మొదట పెద్దగా అనుమానించలేదు. తమకు చెప్పకుండానే వారు పని మానేసి వెళ్లిపోయి ఉంటారని భావించారు. అయితే ఆ తర్వాత ఇంట్లోకి వెళ్లి పూజ గదిని పరిశీలించగా అక్కడ విగ్రహానికి ఉన్న బంగారు గొలుసు మాయమైనట్లు గుర్తించారు. దాంతో అనుమానం వచ్చి బెడ్‌రూమ్‌లోని లాకర్లను తనిఖీ చేయగా.. అందులో దాచిన కిలో బంగారం, వజ్రాభరణాలు కనిపించకుండా పోయాయి. ముందే తయారుచేసుకున్న డూప్లికేట్ కీస్ సహాయంతో లాకర్లు తెరిచి ఈ దోపిడీకి పాల్పడినట్లు గుర్తించారు. బాధితుడు వెంటనే గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సాయంతో ఆధారాలు సేకరించారు. ప్రత్యేక దర్యాప్తు బృందాలు విల్లా పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి.

## విద్యార్థులపైనా యుద్ధం ఎఫెక్ట్

- భారీగా పెరుగనున్న ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు
- పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో భారం
- తల్లిదండ్రుల జేబులకు చిల్లు

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** పశ్చిమాసియా యుద్ధ ప్రభావం స్కూల్ విద్యార్థులపైనా పడుతోంది. యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో.. కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 3 సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. ఈ నేపథ్యంలోనే పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోలు, ప్రైవేటు కార్లు కూడా ధరలు పెంచేస్తున్నాయి. ఇక త్వరలోనే స్కూళ్లు ప్రారంభం కానుండగా.. విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ ఫీజులను ఆయా వాహనదారులు పెంచేస్తున్నారు. దీంతో స్కూల్ పిల్లల తల్లిదండ్రులకు ఈ పెంపు కూడా అదనపు ఆర్థిక భారంగా మారుతోంది. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు హైదరాబాద్‌లో స్కూల్ ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు పెరిగినట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ ధరలు పెరగడంతో.. ఆటో డ్రైవర్లు, ప్రైవేటు కార్లు ఒక్కో విద్యార్థిపై రూ.1000 నుంచి రూ.1200 వరకు ట్రాన్స్‌పోర్టు ఛార్జీలను పెంచినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇది తమకు అదనపు ఆర్థిక భారంగా మారుతోందని వాపోతున్నారు. గతేడాదితో పోలిస్తే రవాణా ఖర్చులు గణనీయంగా పెరిగినట్లు పేర్కొంటున్నారు. అయితే ఇంధన ధరలు పెరగడం వల్లే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వాహనదారులు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. చమురు ధరలు ఒక్కసారిగా పెరగాయని.. తప్పనిసరి పరిస్థితుల్లో ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు పెంచాల్సి వచ్చిందని చెబుతున్నారు.

గతేడాది తమ ఇద్దరు పిల్లలకు కలిసి రూ.6 వేలు ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు చెల్లించామని చెప్పిన ఓ మహిళ.. ఈ ఏడాది అది ఏకంగా రూ.7,500కి పెరిగినట్లు తెలిపారు. ఇక గత సంవత్సరం తమ ఒక్కగానొక్క పిల్లాడిని స్కూల్‌కు పంపించేందుకు ఆటోకు రూ.3,500 చెల్లించగా.. ఈ ఏడాది రూ.4,500కి పెంచారని మరో వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. చమురు ధరలు పెరగకముందు హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ. 107.39.. డీజిల్ రూ. 95.64గా ఉండేది. పెంచిన తర్వాత.. పెట్రోల్ రూ. 115.73, డీజిల్ రూ.103.82గా కొనసాగుతున్నాయి. దీంతో లీటర్ పెట్రోల్, డీజిల్‌పై దాదాపు రూ.8 పెరుగుదల కనిపించింది.



## 50 ఏండ్లు...

(మొదటి పేజీ తరువాయి)

వయసు పైబడిన వారు హెల్త్ సర్టిఫికేట్‌ను కూడా సమర్పించి రీన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంలో భాగంగా, ఈ మొత్తం ప్రక్రియను సులభతరం చేసేందుకే వ్యాలిడిటీని 50 ఏళ్లకు పెంచాలని కేంద్రం భావిస్తోంది.

**ఆర్టీఓ ఆఫీసులకు వెళ్లే పని లేకుండా..**

కేవలం డ్రైవింగ్ లైసెన్స్ మాత్రమే కాకుండా, రవాణా రంగానికి సంబంధించి మరికొన్ని కీలక సేవలను కూడా డిజిటలైజ్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. వాహనాల యాజమాన్య బదిలీ (వెహికల్ ఓనర్‌షిప్ ట్రాన్స్‌ఫర్), పర్మిట్ల పునరుద్ధరణ (పర్మిట్ రీన్యూవల్స్) వంటి సేవలను పూర్తిగా ఆన్‌లైన్ చేయాలని చూస్తోంది. దీనివల్ల పేపర్ వర్క్ తగ్గడమే కాకుండా, చిన్న చిన్న పనుల కోసం సామాన్య పౌరులు ఆర్టీఓ ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోతుంది.

**తప్పు చేస్తే లైసెన్స్ కట్!**

మరి 50 ఏళ్ల పాటు లైసెన్స్ ఇస్తే ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే వారిని కట్టడి చేయడం ఎలా? అనే ప్రశ్నకు కూడా అధికారులు సమాధానం ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే డ్రైవర్లకు 'నెగటివ్ పాయింట్లు' కేటాయించేలా ఒక కఠినమైన వ్యవస్థను తీసుకురాబోతున్నారు. ఈ నెగటివ్ పాయింట్ల ఆధారంగా సదరు డ్రైవర్ లైసెన్స్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేయడం లేదా పూర్తిగా రద్దు చేయడం (క్యాన్సిలేషన్) జరుగుతుంది. దీనివల్ల ఎంత కాలం వ్యాలిడిటీ ఉన్నా.. డ్రైవర్లు బాధ్యతాయుతంగా నడుచుకునేలా నియంత్రించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్న ఈ ప్రతిపాదన ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందనే దానిపై మంత్రిత్వ శాఖ ఇంకా ఎలాంటి అధికారిక తేదీని ప్రకటించలేదు.

## శాంతి మంత్రానికి వీడ్కోలు?

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది. అంతర్జాతీయంగా ఆయుధాల డేటాను విశ్లేషించే ప్రధాన సంస్థ ఎస్ఐపీఆర్ఐ... భారత్ అణు సామర్థ్యానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. అణు వార్‌హెడ్లను ఇప్పటివరకు ప్రత్యేక నిల్వ కేంద్రాలకే పరిమితం చేసిన భారత్, గతంలో ఎన్నడూ లేనంతగా వాటిని క్షిపణి సైలోలు, అణు జలాంతర్గాములకు అనుసంధానించింది. ఈ మొబైలైజేషన్ ప్రక్రియ దేశ అణు సన్నద్ధతను మరింత పెంచినట్లు నివేదిక స్పష్టం చేస్తోంది.

జనవరి 2026 నాటికి భారత అణు ఆయుధ సంపత్తి 190కి చేరిందని ఈ నివేదిక పేర్కొంది. గత ఏడాది కాలంలో ఈ సంఖ్యలో స్వల్ప పెరుగుదల నమోదైంది. ఈ ఆయుధాలను గగనతల, భూతల క్షిపణి వ్యవస్థలు, ఎస్ఎస్‌బీఎన్ లతో కూడిన అణు త్రయాన్ని మరింత బలోపేతం చేయడానికి కేటాయించినట్లు తాజాగా విడుదలైన సిప్రీ నివేదిక తెలిపింది. శాంతి కాలంలో అణు వార్‌హెడ్లను డెలివరీ సిస్టమ్‌లకు దూరంగా నిల్వ చేస్తుందని భారత్ గురించి చాలా కాలంగా భావిస్తున్నారు. అయితే, క్షిపణులను క్యానిస్టర్లలో ఉంచడం, సముద్ర గర్భంలో నిఘా పెంచడం వంటి చర్యలు, వార్‌హెడ్లను ప్రయోగ వ్యవస్థలతో అనుసంధానించే దిశగా భారత్ మారుతోందని సూచిస్తున్నాయని నివేదిక తెలిపింది.

## ఉపాధి కోసం వెళ్లి.. కానరానిలోకాలకు...

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర విచారకరమని పేర్కొంటూ ఎక్స్ (ట్విటర్) వేదికగా సంతాపం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారికి అవసరమైన సహాయం అందిస్తున్నట్లు వెల్లడించింది. బాధితుల కుటుంబాలతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని, అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపడుతున్నామని తెలిపింది. దుబాయ్ పోలీసు ట్రాఫిక్ జనరల్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ బ్రిగేడియర్ జుమా సలేం బిన్ సువైదాన్ వెల్లడించిన వివరాల ప్రకారం, సాంకేతిక లోపం కారణంగా ఒక ట్రక్కు ఎమిరేట్స్ రోడ్డుపై అకస్మాత్తుగా నిలిచిపోయింది. ట్రక్కు రోడ్డుమధ్యలో ఆగిపోవడంతో వెనుక నుంచి వస్తున్న మినీ బస్సు దానిని గమనించలేక బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైనట్లు అధికారులు తెలిపారు.

ప్రాథమిక విచారణలో బస్సు డ్రైవర్ తగినంత అప్రమత్తంగా వ్యవహరించలేదని అధికారులు గుర్తించారు. అలాగే రహదారి భద్రతా నిబంధనల ప్రకారం పాటించాల్సిన సురక్షిత దూరాన్ని పాటించకపోవడం కూడా ప్రమాద తీవ్రతను పెంచినట్లు పేర్కొన్నారు. ట్రక్కు నిలిచిపోయిన విషయాన్ని ముందుగానే గుర్తించి ఉంటే ప్రమాదాన్ని నివారించే అవకాశం ఉండేదని ట్రాఫిక్ అధికారులు అభిప్రాయపడ్డారు.

**సహాయక చర్యలు వేగవంతం**

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది, అత్యవసర సేవల బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. బస్సులో చిక్కుకుపోయిన ప్రయాణికులను ప్రత్యేక పరికరాల సహాయంతో బయటకు తీశారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ప్రమాదం కారణంగా ఎమిరేట్స్ రోడ్డుపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అనంతరం అధికారులు ప్రమాదానికి గురైన ట్రక్కు, మినీ బస్సును రహదారి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను సాధారణ స్థితికి తీసుకువచ్చారు. సంఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని దుబాయ్ పోలీసులు వెల్లడించారు.


**భారతీయుల్లో ఆందోళన**

యూఏఈలో లక్షలాది మంది భారతీయులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు. ఈ ప్రమాదంలో భారతీయ కార్మికులు ప్రాణాలు కోల్పోవడంతో అక్కడి భారతీయ సమాజంలో విషాదం నెలకొంది. మృతుల పూర్తి వివరాలు, స్వస్థలాలు గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు భారత రాయబార కార్యాలయం చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. సుదూర ప్రయాణాలు చేసే వాహనాల డ్రైవర్లు సురక్షిత దూరం పాటించడం, రహదారిపై నిలిచిపోయిన వాహనాలను ముందుగానే గుర్తించే జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ నిపుణులు సూచిస్తున్నారు. ఈ విషాదం పలువురు భారతీయ కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది.



## తెలంగాణకు భారీ వర్ష సూచన..

(మొదటి పేజీ తరువాయి)



సిద్దిపేట, జనగాం, హనుమకొండ, సిరిసిల్ల, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ మెదక్, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, ఖమ్మం, కరీంనగర్, నారాయణపేట, గద్వాల్, నల్గొండ, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 15 మిల్లీమీటర్ల నుంచి 20 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశముందని పేర్కొన్నారు. ఇక హైదరాబాద్ నగరంలో సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షాలు పడనున్నట్లు అంచనా వేశారు. నైరుతి రుతుపవనాల ఆగమనంతో.. వర్షాలు పడగా.. అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు నాటడం కోసం వర్షాలు పడాలని గత కొన్ని రోజులుగా రైతులు చేస్తున్న ఆర్తనాదాలు తీరాయి. తొలకరి వర్షాలు పడుతుండటంతో.. పొలం పనులు ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే పొలం రెడీ చేసుకున్న రైతులు.. విత్తనాలు విత్తేందుకు సిద్ధం అవుతున్నారు.

పీపుల్స్ డైరీ
కరీంనగర్
బుధవారం, 10 జూన్ 2026
సంపుటి : 18, సంచిక : 98


# కాంగ్రెస్ కుట్రలను ఓడిద్దాం..సింగరేణిని కాపాడుకుందాం

- 137 ఏండ్ల చరిత్రలో ఎన్నడూ లేనివిదంగా కొత్తగా నిబంధనలు.
- హిట్లర్ వారసత్వం వద్దూ..
- కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థను ఏటీఏంలా వాడుకుంటున్నారు.
- కాంగ్రెస్ దివాలాకోరు విధానాల వల్ల సంస్థ నష్టపోతుంది.
- రేవంత్ రెడ్డి చుట్టాలకు అధిక రేట్లకు కాంట్రాక్టు పనులు.
- 12వ తేదీన హరీష్ రావు సభను విజయవంతం చేద్దాం.

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి...



**భూపాలపల్లి జూన్ 09 పీపుల్స్ డైరీ:** సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలను కుట్రలను ఓడిద్దాం.. సింగరేణిని కాపాడుకుందాం కార్మిక లోకం ఏకం కావాలి అంటూ మంగళవారం భూపాలపల్లి సింగరేణి ఏరియా కెటికె -1 ఇంక్లైన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి,పాల్గొన్నారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు బానిసలు అవుదామా లేదా వారి అక్రమాలపై తిరగబడదామ నిర్ణయం మీ చేతుల్లోనే ఉందన్నారు. కొంతమంది మమ్మల్ని అంటున్నారు మీరు గుర్తింపు సంఘం నాయకులుకారు మీకు ఎటువంటి బాధ్యత లేదు అని, మరీ ఈ రోజు గుర్తింపు సంఘాలు కార్మికుల పక్షాన మాట్లాడనప్పుడు, వాళ్ళ హక్కులను పరిరక్షణకై మా మీద గురుతరమైన బాధ్యత ఉందన్నారు. నేడు సింగరేణి ఇన్వాలిడేషన్ ఒక్క సమస్య అయితే, అసలు సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారింది.నేటి ప్రభుత్వంలో కార్మికుల జీతాలు ఇవ్వడం కొరకు ఏ బ్యాంకు ఓడి ఇస్తదా అని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి కనపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బిల్స్ ఇవ్వకపోగా దాదాపు 55 వేల కోట్ల రూపాయలు సింగరేణి సంస్థకు బాకీ పడ్డది.దీని వల్ల సింగరేణి సంస్థ దివాళా తీసే పరిస్థితి ఏర్పడింది.కేసీఆర్ గారి నాయకత్వంలో బొగ్గు టెండర్లు ఎటువంటి రాజకీయా ప్రమేయం లేకుండా నిర్వహించడం జరిగిందనీ తెలిపారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల అంశంలో ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. సింగరేణిలో సుమారు 13 వేల మంది కార్మిక కుటుం బాలకు సంబంధించిన వారసత్వ ఉద్యోగాల మెడికల్ అన్‌ఫిట్ అంశంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తోందని గండ్ర ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా మొండిచేయి చూపడం సరికాదని అన్నారు. భూపాలపల్లి అభివృద్ధి అంతా గత ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం జిల్లాకు ప్రత్యేకంగా చేసిన అభివృద్ధి ఏదీ కనిపించడం లేదని ఆయన విమర్శించారు. భూపాలపల్లిని జిల్లాగా ఏర్పాటు చేయడం, మెడికల్ కాలేజీ మంజూరు చేయడం వంటి కీలక నిర్ణయాలు గత ప్రభుత్వంలోనే తీసుకున్నట్లు గుర్తుచేశారు. సింగరేణి కార్మికులకు అవసరమైన వసతులు ఎక్కడ లేని విదంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ వంటి సంక్షేమ కార్యక్రమాలు గత ప్రభుత్వంలో అమలు చేశామని పేర్కొన్నారు.కాబట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి పనితీరు ఎలా ఉందో ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. ఈ నెల 12వ తేదీన మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే హరీష్ రావు భూపాలపల్లి బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి విచ్చేస్తున్నా నేపథ్యంలో సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.తెలంగాణ సింగరేణి బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు,పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్మికులు తదితరులు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

ఏఐటీయూసీ రాష్ట ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్


- సింగరేణి లో మోగనున్న సమ్మె సైరన్
- 22 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు వెళ్లొచ్చు
- కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- సమ్మె నోటీసు అందజేసిన ఏఐటీయూసీ నాయకులు
- ఏఐటీయూసీ రాష్ట ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్



**భూపాలపల్లి జూన్ 09 పీపుల్స్ డైరీ :** సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే సమ్మె సైరన్ తప్పదని, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేయడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు.మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కొమురయ్య భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గుర్తింపు సంఘంగా గెలిచిన నుండి కార్మిక సమస్యలపై అనేకసార్లు స్ట్రక్చర్ మీటింగ్లలో ప్రభుత్వానికి యాజమాన్యానికి వివరిం చినప్పటికీ పరిష్కారం కాలేదని అన్నారు. సింగరేణిలో మెడికల్ అన్ ఫిట్ పొందిన 400 మంది కార్మికులకు నియామక పత్రాలు అందజేయాలని, డిపె ండెంట్ ఉద్యోగాలను పాతవి నాదనంలో కొనసాగించాలని, మెడికల్ బోర్డును నిర్వహించాలని కోరారు. మారుపేరుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి అనేకసార్లు వివరించడం జరిగింది చెప్పారు.కోల్ ఇండియా మాదిరిగా పెరుక్స్ పై ఇన్కమ్ టాక్స్ రిఫండ్ చేయాలని, సింగరేణిలో నూతన గనులు ఏర్పాటు చేయాలని అనేకసార్లు యాజమాన్యానికి విన్నవించిన పరిష్కరిం చడంలో పూర్తిగా విఫలమైయ్యారని అన్నారు. చేసేదేమీ లేక సమ్మెకు పిలుపు ఇవ్వడం జరిగిందని అందులో భాగంగానే యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని యాజమాన్యం, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బట్టి 21 లోగా సింగరేణిలో సమ్మె తప్పదని హెచ్చరించారు. గతం కంటే సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైంది అందువల్లనే సింగరేణి దివాలా తీసిందని అన్నారు. సింగరేణికి ప్రభుత్వం చెల్లించవలసిన బకాయి చెల్లింపు చేయాలని కోరారు. కార్మికుల కు 40 శాతం లాభాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా యాజమాన్యం మన పరిశీలించి కార్మిక సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీ యూసీ బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్, ఏఐటియుసి వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గురిజపల్లి సుధాకర్ రెడ్డి, కాంట్రాక్ట్ కార్మికుల ఇంచార్జ్ నూకల చంద్రమౌళి, రాజ్ మహమ్మద్, దేవా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# 11న తలపెట్టినరైతు సమ్మేళనం ను విజయవంతం చేయండి

- సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్





**జమ్మికుంట. జూన్ 09పీపుల్స్ డైరీ :** రైతాంగానికి మేలు చేసే ప్రకృతి వ్యవసాయం కోసం బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 11న జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన రైతు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు . సోమవారం రోజున జమ్మికుంటలో స్థానిక బిజెపి నేతలతో రైతు సమ్మేళన ప్రోగ్రాం కు సంబంధించి సన్నాక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన గంగడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకాన్ని తగ్గించి, పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం (నాచురల్ ఫార్మింగ్ ) వైపు రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పార్టీ ఆధ్వర్యంలో సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భూసారాన్ని కాపాడుకుంటూ, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంలో ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సమ్మేళన కార్యక్రమాలు దేశవ్యాప్తంగా కొనసాగుతు న్నాయని తెలిపారు. జమ్మికుంటలో జరిగే రైతు సమ్మేళన కార్యక్రమానికి కేంద్రమంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజ రవుతారని తెలిపారు. జిల్లాలోని రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాలు, బిజెపి నాయకులు, కా ర్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈకా ర్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, మండల అధ్యక్షులు రమేష్ యాదవ్, ఇల్లంతకుంట మండల అధ్యక్షులు వెంకటరమణ రెడ్డి, హుజురాబాద్ పట్టణ, మండల అధ్యక్షులు, తుర్పాటి రాజు, కొండల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, ఆకుల రాజేందర్, ఓజ్జా శ్రీనివాస్, పుప్పాల రఘు, కైలాసకోటి గణేష్, ప్రశాంత్, ఆడువాల శ్రీధర్, కౌన్సిలర్లు కొలకాని రాజకుమారి, తుర్పాటి చందన-శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా..సామాజిక పరివర్తన సదస్సు



**జమ్మికుంట. జూన్ 09పీపుల్స్ డైరీ :** బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పి) హుజురాబాద్ నియోజకవర్గం లోని జమ్మికుంట ఇల్లంతకుంట వీణవంక హుజురాబాద్ కమలాపూర్ మండలాలలో సెక్టార్ మరియు బూత్ కమిటీల నాయకులతో జూన్ 7 ఆదివారం జమ్మికుంట వినాయక గార్డెన్ లో క్యాడర్ క్యాంపు శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడం జరిగింది.హుజురాబాద్ అసెంబ్లీ అధ్యక్షులు మందసమ్మయ్య సభాధ్యక్షుత చేపట్టి నాయకులతో మహనీయులకు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు దొడ్డి సమ్మయ్య హాజరై వివిధ మండలాల నుండి సమావేశానికి విచ్చేసిన నాయకులకు బహుజన సమాజ్ పార్టీ బలోపేతంకై దిశ నిర్దేషణ చేశారు.బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా ప్రతి ఒక్కరు బూత్ కమిటీ లెవెల్ లో సమర్ధవంతంగా పని చేయాలని, 10 శాతం ఉన్న అగ్రకుల ఆధిపత్య నాయకులకు ఓట్లేసి అధికారాన్ని అంటగట్టడం మన దౌర్భాగ్యం అని అన్నారు. ఇకనైనా 90 శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ అగ్రకుల పేద ప్రజలందరూ బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజన సమాజ్ పార్టీ బలమైన రాజకీయ శక్తిగా తయారు కావాలని పిలుపునిచ్చారు.దేశంలో మహనీయుల ఆశయ సాధనకై పనిచేసే ఏకైక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ అని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ అసెంబ్లీ ఇన్చార్జిలు. వేల్పుల మల్లేశం, డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) ఎమ్మెల్యే, ఎంపీ కంటెస్టెంట్ అభ్యర్థి మారపల్లి మొగిలయ్య, సీనియర్ నాయకులు , ఈదునూరి రమేష్, అసెంబ్లీ నాయకులు పెరిక శ్రీనివాస్ , మారముల్ల సదయ్య, రాచపల్లి రమేష్, గరిగ చంద్రయ్య, సెక్టార్ కమిటీ, బూత్ కమిటీ నాయకులు, బహుజన నాయకులు మేధావులు సుమారు 150 మంది పాల్గొన్నారు.

# పల్లవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాక్సింగ్ క్రీడాకారులకు టీ-షర్టుల పంపిణీ



**హసన్ పర్తి, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా పల్లవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాక్సింగ్ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు హసన్‌పర్తి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల లో టీ-షర్టులు అందజేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, డ్రగ్ కంట్రోల్ ఆఫీసర్స్ ఇండియా వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు లయన్ గుండమీది కోటేశ్వరరావు మాట్లాడుతూ... క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. బాక్సింగ్‌లో రాణిస్తున్న యువ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించడం సామాజిక బాధ్యతగా పేర్కొన్నారు.టీ-షర్టులు అందుకున్న క్రీడాకారులు ట్రస్ట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి మంచి పేరు తీసుకువస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ శీలం నరేందర్, శశికుమార్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు లయన్ డా. దీవి అజిత్ కుమార్, తోట సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బందికి ప్రశంశ పత్రాలు..




**భూపాలపల్లి జూన్ 09 పీపుల్స్ డైరీ :** విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాల ప్రదానం భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆధ్వర్యంలో విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందిని అభినందించి పోలీస్ కార్యాలయంలో ప్రశంసాపత్రాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు నా ణ్యమైన పోలీసు సేవలు అందించడంలో ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీ, సేవా దృక్పథంతో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని తెలిపారు.పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ తమ విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

# ఈ వి ఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**భూపాలపల్లి జూన్ 09 పీపుల్స్ డైరీ :** జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఈవిఎం, వివి ఫ్యాట్ గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు మరియు వీవీపాట్ యంత్రాల భద్రతను పరిశీలించారు. గోదాంలో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, సీసీటీవీ పర్యవేక్షణ, అగ్ని మాపక పరికరాలు, డబుల్ లాక్ సిస్టమ్ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే, యంత్రాల నిర్వహణ రికార్డులు, స్ట్రాంగ్ రూమ్ రిజిస్టర్‌లను తనిఖీ చేసి, ఎన్నికల సంగం సూచించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత మరియు నిష్పాక్షికత కోసం ఈవిఎంల, వివి ఫ్యాట్ ల భద్రత అత్యంత కీలకమని ఎన్నికల సంగం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయనున్నామని తెలిపారు. గోదాంలో ఉన్న అన్ని యంత్రాలు సక్రమంగా భద్రపరచబడి ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో సంతకాలు చేసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తాళం వేసి సీల్ వేశారు.ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, నవీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నారాయణ రెడ్డి బదిలీ



**హుజురాబాద్, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** హుజురాబాద్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణ రెడ్డి ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీ అయినట్లు విశ్వసనీయ సమాచారం. ఆయనను మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ చేసినట్లు తెలుస్తోంది.డాక్టర్ నారాయణ రెడ్డి బదిలీ అయినప్పటికీ, హుజురాబాద్ ఏరియా ఆసుపత్రికి ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తి స్థాయి కొత్త సూపరింటెండెంట్‌ను నియమించలేదు. దీంతో ఆసుపత్రి పరిపాలన, వైద్య సేవలకు అంతరాయం కలగకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేపట్టారు.ప్రస్తుతం ఆసుపత్రిలో సీనియర్ వైద్యుడిగా సేవలందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్ రెడ్డికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన ఈ బాధ్యతలను నిర్వహించనున్నారు.గత కొద్ది రోజులుగా వైద్య ఆరోగ్య శాఖలో విస్తృత స్థాయిలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సూపరింటెండెంట్లు, సివిల్ సర్జన్లు, స్పెషలిస్ట్ వైద్యులు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బందిని ప్రభుత్వం బదిలీ చేస్తోంది.పరిపాలనా సౌలభ్యం, సుదీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులకు స్థానచలనం కల్పించడంలో భాగంగానే ఈ బదిలీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. హుజురాబాద్ ఏరియా ఆసుపత్రికి త్వరలోనే పూర్తి స్థాయి సూపరింటెండెంట్‌ను నియమించే అవకాశం ఉందని వైద్య వర్గాలు భావిస్తున్నాయి.

## ఎస్సీల స్మశాన.వాటికలో నీటి వసతి కల్పించిన సర్పంచ్ స్వప్న



**సైదాపూర్ జూన్ 9 ( పీపుల్స్ డైరీ ) :** సైదాపూర్ మండల కేంద్రము లో ఊర గుట్ట వద్ద దళితుల స్మశాన వాటిక దగ్గర పంపు సెట్టు బోరు మోటర్ రిపేర్ లో ఉండగా దానిని కొన్ని సంవత్సరాలుగా రిపేరు చేయక ఉండడం వలన ప్రజలు ఇబ్బందులకు ఎదుర్కొన్న విషయాన్ని స్థానిక సర్పంచ్ మునిగంటి స్వప్న-సంతోష్ గమనించి సమస్యను పరిష్కరించాలని గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు రిపేరు చేయించి ప్రారంభం చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో పాలకవర్గ సభ్యులు బోనగిరి వెంకటలక్ష్మి,,వంగ తిరుమలేష్, బండారి భరత్,పొడిశెట్టి అజయ్,బోనగిరి యేసుమని, పంచాయతి కార్యదర్శి బోనగిరి సారయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చల్లగా చూడమ్మా రేణుక ఎల్లమ్మ తల్లి



**సైదాపూర్ జూన్ 9( పీపుల్స్ డైరీ ) :** కరీంనగర్ జిల్లా సైదాపూర్ లో గౌడ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా రేణుక ఎల్లమ్మ బోనాల పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా ఎల్లమ్మ తల్లికి అనగోని కొమురేల్లి కుటుంబికులు ఏడంతురాల బోనం, బొమ్మగాని రాజకుమార్ దంపతులు కుటుంబీకులు, మాత బోనం పైడిపల్లి రవీందర్ గౌడ్ కుటుంబీకులు అమ్మవారికి సమర్పించారు.. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు అనగోని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఏటా అమ్మవారికి భక్తి పెద్దలతో బోనం సమర్పిస్తున్నామని, ముందుగ అమ్మవారికి కళ్యాణం నిర్వహించి, సాయంత్రం ఏడంతరాల బోనం సమర్పిస్తామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో వెంకట్రాజన్ గౌడ్ శ్రీనివాస్ గౌడ్ యాదగిరి పరుశరాములు గౌడు కిరణ్ తిరుపతి క లింగం సంతోష్ ఆకుల రమేష్ కృష్ణ మహిళలు గ్రామస్తులు, పలువురు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

## డెస్సింగ్ టేబుల్ పడి తీవ్ర గాయాలు

### 108 వాహనంలో ఆసుపత్రికి తరలింపు



**ఆళ్ళపల్లి జూన్ 9(పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని చెలగట్టు గ్రామంలో మంగళవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో గృహోపకరణాలు సర్దుతున్న సమయంలో ఈసం నరసమ్మ అనే మహిళ తలపై అనుకోకుండా భారీ డ్రెస్సింగ్ టేబుల్ పడిపోవడంతో తీవ్రంగా గాయ పడింది. ఈసం నరసమ్మ ఇంట్లో పనులు చేస్తుండగా పైనుంచి బలమైన డ్రెస్సింగ్ టేబుల్ ఒక్కసారిగా తలపై పడింది. దీంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం ప్రారంభమైంది. కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ పైలట్ పరమ సునీల్ కుమార్, ఈఎంటీ ఆకాష్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. రక్తస్రావం కాకుండా ప్రథమ చికిత్స చేసి, అప్రమత్తంగా వ్యవహరించి క్షతగాత్రురాలిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నరసమ్మకు ప్రథమ చికిత్స అందించి, అవసరమైన పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. కుటుంబ సభ్యులు 108 వాహన పైలట్ పరమ సునీల్ కుమార్, ఈఎంటీ ఆకాష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమయానికి స్పందించి ప్రాణాపాయం నుంచి కాపాడారని అన్నారు

## కళాకారులను సన్మానించిన సామాజిక కార్యకర్త



**మెట్ పల్లి జూన్ 9:(పీపుల్స్ డైరీ) :** మల్లాపూర్ మండల కేం ద్రంలో గ్రామ పంచాయతీ ఆవరణలో 'చిందు యక్షగా న కళాబృందం ' మెట్ పల్లి వారు జానపద ఆట ఎల్ల మ్మ ఆట అత్యంత కళాత్మ కంగా నిర్వహించి నారు. ఈ కార్యక్రమం లో కళాకారుల ను మల్లాపూర్ మండల కేం ద్రానికి చెందిన సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రె డ్డి శాలువాలతో ఘనంగా స న్మానించారు. అంతరించిపోతున్న కళలు ఈ ఆటతో ముందుకు వచ్చినవి. మళ్ళీ పాత రోజులు గుర్తుకు వచ్చి నవి తరతరాలుగా ఉర్రూత లూగించిన ఆటలు ప్రజాద రణ లేక శిథిలమై పోతున్నా యి. జీవితంలోని ప్రతి సం దర్భాన్ని పాటలతో, సంగీ తంతో దీప్తి మంతం చేయ డం జన జీవన సంస్కృతి లో అంతర్భాగం అందుకే అంటారు జీవితాన్ని కాసేపు మరిపింప చేయడానికి కళ లు అని,ఇంతకు ముందు బుడ్డరఖాన్ పాత్ర పోషించి న శంఖర్ అనే వ్యక్తి మర ణం తీరని లోటు అని అ న్నారు. భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి ఈ ఎల్లమ్మ ఆటలో క ళాకారులు గడ్డం మురళి,గ డ్డం నల్ల కొండయ్య, గడ్డం గంగ నర్సయ్య , పున్నమ య్య,గట్టయ్య, ఉపేంద్ర, పి ల్లిట్ల పరమేశ్,గజ్జెల శ్రీనివా స్ ,గడ్డం దుర్గయ్య, గడ్డం మస్కట్ శంకర్, మల్లాపూర్ గ్రామ ప్రజలు సుమారు వె య్యి మంది పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కీమ్ సీట్ల కేటాయింపును నిలిపివేయాలి

- **మాస్టర్స్ స్వామి వివేకానంద పాఠశాల గుర్తింపు రద్దు చేసి, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ సీట్ల కేటాయింపును నిలిపివేయాలి**
- **జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ పర్లపెల్లి నాగరాజు**

**కరీంనగర్ జూన్ 09పీపుల్స్ డైరీ :** జమ్మికుంటలోని మాస్టర్స్ స్వామి వివేకానంద పాఠశాలలో చోటుచేసుకున్న ఘటనలు, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని, 2026-27 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద సీట్ల కేటాయింపును నిలిపివేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపెల్లి నాగరాజు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ద్వారా సుమారు 100 మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ, ప్రభుత్వం కల్పించాల్సిన పుస్తకాలు, బ్యాగులు తదితర సౌకర్యాలు అందించకుండా వారి తల్లిదండ్రుల నుంచే డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గత ఏడాది నవంబర్ 4న పాఠశాల హాస్టల్‌లో ఉంటున్న ఇద్దరు 9వ తరగతి విద్యార్థులు యాజమాన్య వేధింపుల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై సామాజిక సంక్షేమ, బాలల సంక్షేమ శాఖ అధికారులు విచారణ నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఒక బాలికపై పాఠశాల యాజమాన్యానికి చెందిన వ్యక్తులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయాన్ని కూడా ఫిర్యాదులో ప్రస్తావించారు. ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు, ఘటనలు వెలుగులోకి



వచ్చినప్పటికీ సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోలేదని నాగరాజు ఆరోపించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వెంటనే విచారణ చేపట్టి పాఠశాలపై తగిన చర్యలు తీసుకోవాలని, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద కొత్త సీట్ల కేటాయింపును నిలిపివేయాలని కలెక్టర్‌ను కోరారు.

## ఘనంగా "పిఎంఎస్ఎంఎ" 10వ వార్షికోత్సవం

### వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ...

**భీమదేవరపల్లి జూన్ 09: (పీపుల్స్ డైరీ ):** ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ 10వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పి.ఓ (ఎం హెచ్ ఎన్ ) డాక్టర్ రుబీనా మాట్లాడుతూ, గర్భధారణ సమయంలో మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రతీ గర్భిణీ తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రులలో లభించే ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చిన గర్భిణీలకు ఉచితంగా రక్త పరీక్షలు, బి.పి, బరువు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల ద్వారా అధిక ప్రమాదం (హై రిస్క్ ) పొంచి ఉన్న గర్భిణీలను



గుర్తించి,వారికి ప్రత్యేక వైద్య సలహాలు అందించారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉండి,తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీలకు తక్షణ ఉపశమనం కోసం 'ఐరన్ సుక్రోస్' ఇంజెక్షన్లను అందజేశారు. గర్భధారణ సమయంలో కనీసం నాలుగు సార్లు ప్రసూతి పూర్వ పరీక్షలు(ఏఎన్ సి చెకప్స్ ) చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే సమతుల్య పోషకాహారం తీసుకోవడం, గర్భధారణ సమయంలో కనిపించే ప్రమాద సూచనలను ఎలా గుర్తించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలందరికీ పౌష్టికాహార ప్రాధాన్యతను వివరిస్తూ ఉచితంగా పండ్లను పంపిణీ చేశారు. తల్లి,పుట్టబోయే బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది వివరించారు. ఈ ప్రత్యేక వైద్య శిబి రంలో డాక్టర్ రుబీనా హెల్త్ సూపర్‌వైజర్ వాణి, నర్సింగ్ అధికారులు, పారామెడికల్ సిబ్బంది,ఆశా కార్యకర్తలు గర్భిణీలు పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలి

- **తెలంగాణ రాష్ట్ర విద్యార్థుల తల్లిదండ్రుల ప్రధాన డిమాండ్లు**

**హుజూరాబాద్: జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పెరుగుతున్న ఫీజుల భారాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ (TPA) డిమాండ్ చేసింది. విద్యా నియంత్రణ మరియు పర్యవేక్షణ కమిషన్ ను పునరుద్ధరించి, ఫీజుల వ్యవస్థలో పూర్తి పారదర్శకత తీసుకురావాలని కోరింది. తల్లిదండ్రులు ఉంచిన ప్రధాన డిమాండ్లలో ఫీజుల వివరాలను పాఠశాలల ప్రధాన ద్వారాల వద్ద, అధికారిక వెబ్‌సైట్లలో ప్రదర్శించడం, ప్రతి చెల్లింపుకు పక్కా రశీదులు ఇవ్వడం, రాష్ట్ర స్థాయి ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు చేసి ఫీజు నిర్మాణం మరియు ఆడిట్ లెక్కలను అందుబాటులో ఉంచడం ఉన్నాయి. అలాగే ఫీజుల నిర్ణయ ప్రక్రియలో తల్లిదండ్రుల ప్రతినిధులకు స్థానం కల్పించాలని, అక్రమ ఫీజు వసూళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థల గుర్తింపును సస్పెండ్ లేదా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం (RTE) ప్రకారం పేద విద్యార్థులకు కేటాయించాల్సిన 25 శాతం ఉచిత సీట్లను పారదర్శకంగా భర్తీ చేయాలని, ప్రతి పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేసి అందులో 75 శాతం మంది తల్లిదండ్రుల ప్రతినిధులే ఉండేలా చూడాలని సూచించారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా ర్యాంకుల ప్రచారాన్ని నిషేధించి, సృజనాత్మక విద్య, క్రీడలు, కళలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి విద్యాసంస్థలో కౌన్సిలింగ్ సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మౌలిక వసతులు, ఇంగ్లీష్ మీడియం, ఆధునిక ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేసి వాటిని మరింత బలోపేతం చేయాలని, స్థానిక ప్రజాప్రతినిధులు




ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ నిబంధనలన్నింటినీ జూలై 2026 నాటికి అమలు చేయాలని ప్రభుత్వాన్నికోరిన ట్రూ తల్లిదండ్రులు తమ పిల్లల విద్యా హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చింది.

## ఏడాది గడుస్తున్నా రహదారి పునరుద్ధరణ లేదు

### అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**మేడ్చల్, జూన్ 9 (పీపుల్స్ డైరీ):** ప్రజల సౌకర్యార్థం చేపట్టిన సెంటర్ లైన్ డ్రైనేజీ పనులు ఇప్పుడు స్థానికులకు తీవ్ర ఇబ్బందులకు కారణమవుతున్నాయి. డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రధాన రహదారిని పూర్తిగా తవ్విన అధికారులు, పనులు పూర్తయిన తర్వాత రహదారి పునరుద్ధరణను మాత్రం గాలికి వదిలేశారు. ఫలితంగా నెలల తరబడి దెబ్బతిన్న రహదారిపై ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారి ప్రస్తుతం గుంతలమయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండగా, పాదచారులు సైతం భయాందోళనల మధ్య ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో బురద, నీటి నిల్వలతో రహదారి మరింత దారుణంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ప్రతిరోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సంబంధిత అధికా



రులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీ పనులు ప్రారంభించిన సమయంలో త్వరితగతిన పూర్తి చేసి రహదారిని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు, ప్రస్తుతం మౌనం వహించడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తోంది. ప్రజల పన్నుల డబ్బుతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకే భారంగా మారడం బాధాకరమని వారు పేర్కొన్నారు. ఈ రహదారి ద్వారా ఏసీపీ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, రైల్వే స్టేషన్‌తో పాటు పలు గ్రామాలకు అనుసంధానం కల్పించబడుతోంది. ఇంత కీలకమైన రహదారి ఏడాదికి చేరువవుతున్నా పునరుద్ధరణకు నోచుకోకపోవడంపై ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రహదారి మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఉపశమనం కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. డ్రైనేజీ పనులతో దెబ్బతిన్న ప్రధాన రహదారి వర్షాకాలంలో మరింత దారుణంగా మారిన పరిస్థితి అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం ఏడాది గడుస్తున్నా రహదారి పునరుద్ధరణ లేదు..

## రేగొండలో 'ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్'

### గర్భిణీలకు ఉచిత వైద్య పరీక్షలు!

**రేగొండ జూన్ 09 పీపుల్స్ డైరీ :** రేగొండ ప్రాదమిక అరోగ్య కేంద్రం నందు ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం" రేగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హిమ బిందు, ఆధ్వర్యంలో నిర్వహించ డమైనది . ఈ కార్యక్రమంలో జిల్లా డి ఎం హెచ్ ఓ మధు సూదన్, పి వో ఎం సి హెచ్ శ్రీదేవి, పాల్గొని మండల పరిధిలోని ఆయా గ్రామాల 40 మంది గర్భిణీ లు 10 మంది హై రిస్క్ గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించి వారిని ఉద్దేశించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు. రక్త హీనత ఉన్న గర్భిణీ స్త్రీలకు అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే పోషకాలు కల్గిన చిక్కీలు, ప్రోటీన్స్ విటమిన్స్ కల్గిన కోడిగ్రుడ్లు పాలు ఖనిజ లవణాలు, క్యాల్షియమ్ కల్గిన రాగి పిండి తో చేసిన రాగి జావ మొదలైనపోషకాలు కల్గిన ఆహారం తీసుకో వాలని గర్భిణీలకు తెలిపారు. ఆకు కూరలు ప్రతి రోజు తీసుకొనే




ఆహారం లో ఉండాలని తెలిపారు. ప్రమాదకర గర్భిణీ స్త్రీలు డాక్టర్స్ పర్యవేక్షణలో ఉండాలని వివరించారు. ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వఆసుపత్రి కి వచ్చికాన్పులు చేయించుకోవాలని అన్నారు. ప్రభుత్వం వారు అందించే ప్రోత్సహకాలు జనని సురక్ష, ప్రధాన మంత్రి మాతృత్వ వందనయోజన, జనని శిశు సురక్ష యోజన పథ కాల ద్వారా ప్రతి గర్భిణీ స్త్రీ లబ్ది పొందాలని కోరారు.. ఈ కార్యక్రమం లో గర్భిణీలు ఆశ, ఏ ఎన్ ఎం లు ప్రజలు పాల్గొన్నారు..

# అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి

- **10 ఎకరాల్లో 98 కోట్లతో నిర్మించే మల్కాజ్ గిరి మునిసిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణం కోసం శంకుస్థాపన**



**మేడ్చల్ జూన్ 09 (పీపుల్స్ డైరీ) :** 960 కోట్ల రూపాయలతో ఏఓసి సెంటర్ లో ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన. 416 కోట్లతో టీకేఆర్ కాలేజ్ జంక్షన్ లో 6 లేన్ల ఫ్లై ఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన. 37.50 కోట్లతో 100 పడకల మల్కాజ్ గిరి జిల్లా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన. క్యూర్ వన్ యాప్ ను ప్రారంభించిన సీఎం. ఆడబిడ్డల ఆశీర్వాదంతోనే నేను ముఖ్యమంత్రిని అయ్యానని నా ప్రతి సభలో వారికి కుడివైపు సీటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం ఉప్పల్ బగాయతులో మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ముఖ్య మంత్రి మాట్లాడుతూ ఆడబిడ్డలు వేలాది మంది ఇక్కడికి వచ్చి ఆశీర్వదించారు అన్నారు. ఆడబిడ్డలకు నా ప్రతి సభలో ముందు కూర్చునే అవకాశం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు మహిళలు ఆశీస్సులతోనే జడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రి స్థాయికి వచ్చానన్నారు ఐదేళ్లు తిరిగినా మల్కాజ్ గిరి పార్లమెంటు నియోజకవర్గం పూర్తి కాదన్నారు మల్కాజ్ గిరి పార్లమెంట్ అంటే మినీ భారత దేశమని అన్నారు. కిందపడిపోయిన నన్ను మల్కాజ్ గిరి ప్రజలు ఆశీర్వదించి చేయూతన అందించారని అన్నారు ఎంపీ కావడం వల్ల పీసీసీ అధ్యక్షుడిగా సోనియా గాంధీ నియమించి ప్రజా ప్రభుత్వం ఏర్పడటానికి, నేను ముఖ్యమంత్రి కావడానికి కారణం మల్కాజ్ గిరి పార్లమెంట్ స్థానమేనని గుర్తు చేసుకున్నారు ఒక్క పైసా ఆశించకుండా ఆడబిడ్డలు నాకు ఓటు వేశారని వారిని కొనియాడారు గత ప్రభుత్వ సహకారం లేకపోవడంలో మల్కాజ్ గిరి పార్లమెంటులో అభివృద్ధి సరిగా చేయలేకపోయానని అన్నారు. కాలం గిర్రున తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాను. హైదరాబాద్ లో నాలుగు రకాల పరిపాలన జరుగుతుండగా శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో అభివృద్ధి సరిగా జరగడం లేదని అన్నారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయల కల్పన కోసం విజన్ డాక్యూమెంట్ ను తీసుకువచ్చామన్నారు తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో విజన్ డాక్యుమెంటును తీసుకువచ్చి క్రమపద్ధతిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు అవుటర్ రింగ్ రోడ్డు లోపల కోటి ముప్పై లక్షమంది నివసిస్తున్నారని వారికిమౌలిక సదుపాయలు , పరిపాలన సమన్వయం , మూసీ ప్రక్షాళన వంటి జరగాలంటే ప్రక్షాళన అవసరం అని భావించామని అందుకే క్యూర్ ప్రాంతాన్ని ఏర్పాటు చేసి మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామన్నారు రాజకీయ స్వార్థం కోసం, ఎన్నికల కోసం మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని కొందరు అంటున్నారు.. ఎన్నికల కోసం కాదు పరిపాలన సౌలభ్యం కోసం మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ భవనాన్ని నిర్మించుకోవడం ఎంతో సంతోషం అన్నారు

### పరిపాలనను వికేంద్రీకరించేందుకు...

పోలీస్ ,మున్సిపల్ శాఖ పరిధి ఒకేలా ఉండేలా చేశామన్నారు 1600 కోట్ల పనులకు ఈ రోజు శంకుస్థాపనలు చేసుకున్నామన్నారు రాజకీయాలకు అతీతంగా ఈ ప్రాంతం కోసం ఎన్ని నిధులైనా ఇచ్చే బాధ్యత నాదన్నారు. రోడ్లు, చెరువుల సుందరీకరణ , మెట్రో విస్తరణ ..ఏం కావాలన్న నేను చేస్తానని తెలిపారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు మాట్లాడుదాం.. అభివృద్ధి చేసుకుందాం.. సహకరించడానికి నేను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు బండారు లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారు.. నిజంగా రాజకీయం చేస్తే ఉప్పల్ ఎలివేటర్ కారిడార్ కు బండారు రాజిరెడ్డి పేరు పెట్టేవాన్ని కాదని అన్నారు బండారు రాజిరెడ్డి ఉప్పల్ ప్రాంతానికి 40 యేళ్లు సేవలు చేశారని గుర్తు చేసుకున్నారు. గుజరాత్ లో సబర్మతి రివర్ ఫ్రంట్, యూపీలో గంగా రివర్ ఫ్రెంట్ , ఢిల్లీలో యుమునా రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేశారు. మేం మూసీ నది ప్రక్షాళన చేయొద్దా అని ప్రశ్నించారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలో మీటర్ల వరకు మూసీని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసుకుంటే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి, పర్యాటక ప్రాంతం గా మారుతుం దని తెలిపారు. మూసీ మురికి కారణంగా ఇక్కడ భూముల రేట్లు పెరగడం లేదు, నల్గొండ జిల్లాలో మూసీ కాలుష్యం వల్ల ఆనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ఆడబిడ్డలు కడుపుకోత కు గురౌతారని అక్కడి వాళ్లు బయటకు పంపుతున్నారని, మూసీ ప్రక్షాళన చేయమని నల్గొండ ప్రజలు నన్ను పిలిస్తే పాదయాత్ర చేశానని తెలిపారు మూసీలో ఇళ్లు పోయిన వారికి ఇళ్లు ఇస్తాం, చదువు చెప్పిస్తామంటే అడ్డుపడు తున్నారు.. కేంద్ర మంత్రి గా ఉన్న వ్యక్తి ఈ రోజు మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నారు. హైదరాబాద్ మెట్రో ఈ రోజు 9 వ స్థానానికి పడిపోయింది అని తెలిపారు

### మెట్రో ను విస్తరించడానికి అడ్డు

పడుతున్నారన్నారు మెట్రో విస్తరించాలన్న అవసరం ఉందా లేదా అన్నది ప్రజలు ఆలోచించాలన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు వస్తే ప్రపంచంతోనే పోటీ పడే అవకాశం తెలంగాణకు ఉంటుందని అన్నారు. రెండున్నర యేళ్ల నుంచి రీజనల్ రింగ్ రోడ్డు కోసం యాభై సార్లు ఢిల్లీ వెళ్లా, మోదీని కలిశానని తెలిపారు తెలంగాణ ప్రభుత్వం 70 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసింది.. మిగిలిన 25 లక్షలు ఎవరు కొనాలి, కేంద్రం తో ధాన్యం కొనుగోలు చేయించే బాధ్యత కిషన్ రెడ్డికి లేదా అని సీఎం ప్రశ్నించారు. అభివృద్ధి కోసం కలిసి వస్తానని అంటే కిషన్ రెడ్డి నన్ను కేంద్ర మంత్రుల దగ్గరికి తీసుకుపోవడం లేదు తెలిపారు. తుమ్మిడి హట్టి బ్యారేజ్ నిర్మాణం పైన చర్చించడానికి ముందుకు రాకుండా మహారాష్ట్ర ముఖ్యమంత్రి తప్పించుకుని తిరుగుతున్నడు..దీనికి కారణంగా కిషన్ రెడ్డి అన్నింటికి సహకరిస్తే ఎల్బీ స్టేడియంలో కిషన్ రెడ్డికి గండపెండేరం తొడుగుతామన్నారు గతంలో కిషన్ రెడ్డి కుమ్మక్కు రాజకీయాలు చేస్తే ప్రజలు ఓడించారని గుర్తు చేశారు.

### ఎన్నికల సమయంలో రాజకీయాలు చేద్దాం.

కష్టపడి హైదరాబాద్ ను అభివృద్ధి చేసుకుందా మన్నారు ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నా పని చేస్తా.. అది నా బాధ్యత... రాజకీయాలకు అతీతంగా నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. నాగోల్ నుంచి గౌరెల్లి వరకు ఫేజ్ టూ లో మూసీ ప్రక్షాళన చేస్తామన్నారు. వంద రోజుల్లో కార్యాచరణ మొదలవుతుందని సీఎం స్పష్టం చేశారు.

# ఘనంగా ఎస్ టి యు యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఏటూరు నాగారం జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** ములుగు జిల్లా వెంకటాపురం ఎస్ టి యు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య , రామారావు గార్లు పాల్గొని ఎస్ టి యు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా రంగ పరిరక్షణ, ఉపాధ్యాయ హక్కుల సాధనలో 79 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని 80 వ వసంతాలు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయ ఉద్యమ సంఘం ఎస్ టి యు ఉపాధ్యాయినీ ,ఉపాధ్యాయ మిత్రులకు ఎస్ టి యు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియ జేశారు. విద్యారంగ పరిరక్షణ , ఉపాధ్యాయ హక్కుల సాధన ధ్యేయంగా కృషిచేస్తూ, ఉపాధ్యాయుల గొంతుకగా నిలిచి ,గెలిచే సంఘం మన స్టేట్ టీచర్స్ యూనియన్ అని అన్నారు. ఉపాధ్యాయ సంఖ్యాబలంతో సమస్యల సాధనలో సంఘటితంగా ముందుకు సాగుతున్న ఎస్ టి యు సభ్యులందరికీ ఉద్యమాభివందనాలు ఎస్ టి యు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ టి యు ప్రధాన కార్యదర్శి మంచర్ల టవివీరభద్రం మాట్లాడుతూ నాడు నిజాం నిరంకుశ పాలనలో హక్కులు కోల్పోయి, అణచివేతకు గురవుతూ నిర్బంధపు గాఢాంధకారంలో మగ్గుతూ, నిరాశ నిస్పృహలతో జీవయాత్ర కొనసాగిస్తున్న ఉపాధ్యాయ లోకాన్ని చైతన్య పరచుటకై కారుమేఘాలను చీల్చుకుంటూ ఓ కాంతిరేఖ రాగానే అరుణోదయం ఆవిష్కృతమైనది. అని అన్నారు. 80 వసంతాల ఉద్యమ సంఘం ఎస్టీయూ అరుణోదయం పోరుబిడ్డల నుదుట సింధూరమైంది. అరుణ కిరణాలు ఉద్యమ పతాకాలై రెపరెపలాడాయి హక్కుల నినాదాలు శంఖారావాలై ప్రతిధ్వనించాయి. అవి ఉపాధ్యాయ ఉద్యమానికి జాతీయ గీతాలైనాయి అని అన్నారు. ఉపాధ్యాయ లోకాన్ని కదిలించిన ఆ చైతన్య కాంతిరేఖే రాష్ట్రోపాధ్యాయ సంఘంభారత స్వాతంత్ర్యానికి పూర్వమే నాటి హైదరాబాద్ సంస్థానంలో "హైదరాబాద్ స్టేట్ టీచర్స్ యూనియన్"గా ఆవిర్భవించిన ఈ సంఘం అనేక నిర్బంధాలను ఎదుర్కొంటూ వెనుకడుగు వేయకుండా పోరాటాలు చేసింది. 1947 జూన్ 9న ప్రభుత్వ గుర్తింపు పొందింది. భారతదేశ చరిత్రలో ప్రభుత్వ గుర్తింపు పొందిన తొలి రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ సంఘంగా నిలిచింది. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు విలీనమైన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్టేట్ టీచర్స్ యూనియన్ గా ఏర్పడి ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ బడుల పరిరక్షణ లక్ష్యంగా పనిచేస్తోంది. సంఘం ఆవిర్భవించి 79 వసంతాలు పూర్తిచేసుకొని 80వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఇంతటి దీర్ఘ ప్రస్థానం ఏ ఉపాధ్యాయ సంఘానికి లేదనడం అతిశయోక్తి కాదని అన్నారు. ఎస్టీయూ ప్రస్థానం ఒక జీవనది వంటిది. ఎన్నో అవరోధాలు, నిర్బంధాలు, అరెస్టులు ఎదురైనా ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణ, విద్యారంగ సంక్షేమం లక్ష్యంగా తన పోరాటాన్ని కొనసాగించింది. ఉన్నతమైన లక్ష్యాలు, ఆశయాలతో నిర్మితమైన ఈ సంఘాన్ని విభజించేందుకు జరిగిన ప్రయత్నాలు కాలగర్భంలో కలిసిపోయాయి. ఎస్టీయూ తన నాయకులను, కార్యకర్తలను తీర్చిదిద్దింది. మేధావులను చట్టసభలకు పంపింది ఎస్టియు అని అన్నారు.

# దళితుల భూములపై కన్నేస్తే ఊరుకోం: మంత్రి అడ్లూరి

- **ప్రభుత్వం కబ్జాదారులపై అట్రాసిటీ చట్టం కింద చర్యలు**
- **దళితుల ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**



**మేడ్చల్ జూన్ 09 (పీపుల్స్ డైరీ ) :** గుండ్లపోచంపల్లిలో ఎస్సీ కార్పొరేషన్ 49 ఎకరాల భూమి పరిశీలన సర్వే అనంతరం ఫెన్సింగ్ కబ్జాదారులపై కఠిన చర్యలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గుండ్లపోచంపల్లి శివారులో ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన 49 ఎకరాల 20 గుంటల భూమిని పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. దళిత విద్యార్థుల సంక్షేమం కోసం కేటాయించిన ఒక్క గజం భూమిని కూడా కబ్జా చేసేందుకు ఎవరినీ అనుమతించబోమని ఆయన హెచ్చరించారు. ఎస్సీ కార్పొరేషన్ భూములు అన్యాక్రాం తమవుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరితో కలిసి మంత్రి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1991లో సర్వే నంబర్ 509లోని 49 ఎకరాల 20 గుంటల భూమిని దళిత విద్యార్థుల సంక్షేమం, ఉద్యానవన శిక్షణ కార్యక్రమాల కోసం ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములను కొందరు వ్యక్తులు అన్యాక్రాంతం చేస్తున్నారని ఆరోపించిన మంత్రి, దళితుల హక్కులకు భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదన్నారు. భూమికి సంబంధించి సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక అందిన వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆధీనంలో పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపడతామని వెల్లడించారు. "అన్యాక్రాంతం చేస్తున్న వారిలో ఎంత పెద్దవారు ఉన్నా సహించేది లేదు. ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని రక్షిస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే సర్వే నిర్వహించి హద్దురాళ్లు, గేట్లు ఏర్పాటు చేసి భౌతిక స్వాధీన స్థితిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దళితుల ఆస్తుల పరిరక్షణలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని, బెదిరింపులు, ఒత్తిళ్లు, రాజకీయ ప్రభావాలకు లొంగబోదని మంత్రి పేర్కొన్నారు. దళిత విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ఈ భూమి కీలకమని, భవిష్యత్ తరాల ప్రయోజనాల కోసం దీనిని కాపాడటం సామాజిక బాధ్యత అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ భూముల విషయంలో చట్టవ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. "49 ఎకరాల 20 గుంటల్లో ఒక్క గజం భూమి పోయినా చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది" అని వ్యాఖ్యానించారు. అదే సమయంలో ఆ ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న రైతుల ప్రయోజనాలను కూడా పరిరక్షిస్తామని, రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు అవసరమైన దారులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులను ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూముల రక్షణ అంశంపై రాష్ట్ర రెవెన్యూ మంత్రికి నివేదిక సమర్పించి తదుపరి చర్యలను వేగవంతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, వీసీ అండ్ ఎండీ హనుమంత్ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ



**కోహెడ జూన్ 09 (పీపుల్స్ డైరీ) :** సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశానుసారం కోహెడ మండల పరిధిలోని గ్రామాలకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేయడం జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో యువత క్రీడల్లో రానించటం కొరకు, ముఖ్యంగా శారీరక, మానసిక ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటం కొరకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్, స్థానిక సర్పంచ్, సీనియర్ నాయకులు, మార్కెట్ డైరెక్టర్లు, గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# హైదరాబాద్‌కు తరలిన సైదాపూర్ మహిళా సమాఖ్య సభ్యులు

### బస్సును ప్రారంభించిన ఎంపీడీవో యాదగిరి, ఏపీఎం తిరుపతి



**సైదాపూర్ జూన్ 9 ( పీపుల్స్ డైరీ ) :** హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఇందిరా మహిళాశక్తి విజయోత్సవ సభ'కు సైదాపూర్ మండలానికి చెందిన మహిళలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని సంతోషిమాత మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సభ్యులు తమ సొంత బస్సులో ఈ సభకు ఉత్సాహంగా పయనమయ్యారు. ఎంపీడీవో యాదగిరి, ఏపీఎం తిరుపతి ఈ బస్సును ప్రారంభించి మహిళలను హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ సభకు సాగనంపారు. ప్రభుత్వం మహిళా సాధికారత కోసం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా ఈ విజయోత్సవ సభలో పాల్గొంటున్నట్లు సమాఖ్య సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వినోద్, వివిధ గ్రామాల క్లస్టర్ కోఆర్డినేటర్లు (సీసీలు), మండల, గ్రామ సమాఖ్యల ప్రతినిధులు, వీవోఏలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 12న మైనార్టీ కార్పొరేషన్ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు : ఎంపీడీఓ వీరేశం



**భీమదేవరపల్లి జూన్ 9 (పీపుల్స్ డైరీ ):** మైనార్టీ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాలకు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 12-06-2026 (శుక్రవారం) ఉదయం 11:00 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల పరిధిలోని అర్హులైన మైనార్టీ దరఖాస్తు దారులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం ఇప్పటికే ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. దరఖాస్తుదారులు తమ వెంట ఒరిజినల్ ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్,కుల ధృవీకరణ పత్రం ఆదాయ ధృవీకరణ పత్రం బ్యాంకు పాస్ బుక్ దరఖాస్తు రశీదుతో పాటు ఒక సెట్ జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. నిర్ణీత సమయానికి దరఖాస్తుదారులు అందరూ ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, ఆలస్యంగా వస్తే పరిగణనలోకి తీసుకోబడదని ఎంపీడీఓ స్పష్టం చేశారు.

# ఎరువుల కొరత రాకుండా చూడాలి

### కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే సంజయ్



**ప్రతినిధి, జగిత్యాల, జూన్, 09:** వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు యూరియా, డీఏపీ తదితర ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎరువుల కొరత కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు ప్రణాళికతో సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు నిల్వలు ఏర్పాటు చేయడంతో పాటు జిల్లాలోని సహకార సంఘాలు, ఎరువుల విక్రయ కేంద్రాల్లో తగినంత నిల్వలు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు అవసరమైన సమయంలో నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉంటేనే పంటల సాగు సజావుగా సాగుతుందని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**ప్రతినిధి, జగిత్యాల, జూన్, 09:** జగిత్యాల జిల్లా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మల్లాపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో మండలానికి చెందిన 89 మంది లబ్ధిదారులకు రూ.89,10,324 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ఈ పథకాల ద్వారా లక్షలాది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని, ఆడబిడ్డల పెళ్లిళ్ల విషయంలో కేసీఆర్ ఎల్లప్పుడూ అండగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం కోసం కేసీఆర్ అనేక వినూత్న సంక్షేమ పథకాలను అమలు చేశారని, పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నిరంతరం కృషి చేశారని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అమలు చేసిన పథకాలు తెలంగాణ అభివృద్ధికి బాటలు వేసాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని అన్నారు. రైతు బంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి అండగా నిలిచిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో కేసీఆర్ నాయకత్వం కీలక పాత్ర పోషించిందని, భవిష్యత్తులో కూడా బీఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని ఎమ్మెల్యే సంజయ్ పేర్కొన్నారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో ప్రజలపై భారాల మోత

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ విమర్శలు



**ప్రతినిధి, జగిత్యాల, జూన్, 09:** పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నిరంతరం పెంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని బీఆర్ఎస్ నాయకురాలు దావ వసంత సురేష్ విమర్శించారు. ఇంధన ధరల పెరుగుదలతో సామాన్య ప్రజల జీవనం రోజురోజుకూ భారంగా మారుతోందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయని పేర్కొన్నారు. కూరగాయల నుంచి రవాణా ఖర్చుల వరకు ప్రతి రంగంలో ధరలు పెరిగి ప్రజలపై అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ధరలు తగ్గిస్తామని, ప్రజల కష్టాలు తీర్చుతామని హామీలు ఇచ్చిన కూటమి నాయకులు ప్రస్తుతం పెరుగుతున్న ధరలపై మౌనం వహించడం బాధాకరమన్నారు. ఇంధన ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. గత మూడు నెలల్లో గ్యాస్ సిలిండర్ ధర రూ.89 పెరగడం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దేశం, ధర్మం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలపై అదనపు భారాలు మోపుతున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించాలని దావ వసంత సురేష్ డిమాండ్ చేశారు.

## ఆకట్టుకున్న చిరుతల రామాయణం

### రెండు రోజులపాటు అలరించిన కళాకారుల ప్రదర్శనలు..



**చిగురుమామిడి, జూన్09 (పీపుల్స్ డైరీ):** మండలంలోని ఇందుర్తి గ్రామంలో శ్రీ రామాంజనేయ భజన మండలి వారి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైన చిరుతల రామాయణం నాటక ప్రదర్శన రెండుపాటు భక్తులను, చుట్టుపక్కల గ్రామాల ప్రజలను ఎంతగానో ఆకట్టుకుని ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా కళాకారులు తమ తమ పాత్రలకు జీవం పోయడంతో పౌరాణిక వైభవం ఉట్టి పడింది. గ్రామ సర్పంచ్ చింతపుల నరేందర్, మాజీజెడ్పిటిసి అందే స్వామిలు కొబ్బరికాయలు కొట్టి రామాయణం నాటక ప్రదర్శనను ప్రారంభించారు. గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ చిరుతల రామాయణంలోని పలు ఘట్టాలు కళ్ళకు కట్టినట్టు ప్రదర్శించారు. కళాకారుల వేషాధారణలు, పలు పద్యాల ఆలాపన, పలు సంభాషణలు ప్రేక్షకులను కట్టిపడేసాయి. పాతతరం వారు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకోగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో యువత ఎంత ఉత్సాహంగా ఈ ప్రదర్శనను తిలకించారు. మొదటి రోజే ఇందుర్తి గ్రామంతోపాటు పక్కగ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు గ్రామస్తులు కళాకారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆధునిక జీవనంలో పల్లెటూరి సంస్కృతిని, పురాణాలను గుర్తుచేస్తూ యువతకు మన సంప్రదాయాలను పరిచయం చేసేందుకు గ్రామస్తుల సహకారంతో ఈ నాటకాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని సర్పంచ్ చింతపుల నరేందర్ తెలిపారు. ఈ నాటక ప్రదర్శనలో సీతారాముల వారి కళ్యాణం పాదుక పట్టాభిషేకం, సుందరకాండ, రావణవద సన్నివేశాలు మరింత ఆకట్టుకుంది. 10న సీతారాముల పట్టాభిషేకం ఓడిబియ్యం మహోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతపూల నరేందర్, కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్ల కొమురయ్య, వార్డు సభ్యులు అందే బాబు, అందే తిరుపతి, తోట లక్ష్మణ్, అందే స్వరూప సురేష్, కళాకారుల సంఘం రాష్ట్ర కోశాధికారి అందే స్వామి, బోధకులు తాళ్లపల్లి సంపత్, మండల అధ్యక్షుడు అన్నాడి మల్లికార్జున్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు రాములు, పడాల సత్యనారాయణ, మండల కార్యదర్శి కలువాల చంద్ర రెడ్డి, గట్టు మొగిలి, గ్రామస్తులు అందే చిన్నస్వామి, భీమర లక్ష్మణ్, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ కుతుబుద్ధిన్, అందే పోచయ్య, అందే బాలయ్య, కొంకటి లక్ష్మణ్, అందే హన్మయ, అందే సింగరయ్య, అందె వెంకయ్య, కుట్ల మొగిలి, కన్నం భూమయ్య, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

- విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలి
- పాఠశాలల పునఃప్రారంభానికి ముందే అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలి
- కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు



**ఏటూరు నాగారం జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం పొందేందుకు విద్యార్థుల సంఖ్యలు పెంచాలని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు అన్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు పెంపు, విద్యా నాణ్యత మెరుగుదల, ఎఫ్ ఎల్ ఎన్ మిషన్, ఎఫ్ ఆర్ ఎస్ హాజరు, బడిబాట కార్యక్రమం నిర్వహణ, పాఠశాలల పునఃప్రారంభ ఏర్పాట్లపై మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ పాఠశాల, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పాఠశాలలో 10 శాతం మేర విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా చూడాలని, విద్యార్థులకు కల్పిస్తున్న మెరుగైన సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని జీరో పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల నమోదుకు కృషి చేయాలని, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాలను విద్యాశాఖ అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, బోధన, హాజరు, మౌలిక సదుపాయాల పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోపు తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, శానిటేషన్, విద్యుత్, ఫర్నిచర్, పరిశుభ్రత తదితర అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని తెలుపుతూ చిన్నబోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 12 మంది నుంచి 120 మందికి పైగా పెంచడంలో విశేష కృషి చేసిన కానిస్టేబుల్ ధూపాటి సతీష్, గ్రామ సర్పంచ్‌ను జిల్లా కలెక్టర్ అభినందించారు. సమావేశంలో జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కొప్పుల మల్లేశం, డి ఎమ్ ఒ హెచ్ ఓ గోపాలరావు, మున్సిపల్ కమిషనర్ సంపత్, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- 30 రోజుల్లో నిజాంపేట డంపింగ్ యార్డు తరలింపు
- విద్యార్థులు, ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రూ.20 కోట్లతో ఎస్సీ హాస్టల్.. పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తాం
- అసాంఘిక శక్తుల ఆటకట్టింపుకు ప్రత్యేక పెట్రోలింగ్



**మేడ్చల్ జూన్ 09(పీపుల్స్ డైరీ):** బాచుపల్లి పరిధిలోని నిజాంపేట డంపింగ్ యార్డును 30 రోజుల్లోగా తరలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రకటించారు. వేలాది మంది డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు, స్థానిక కాలనీవాసులు, భవిష్యత్తులో ఇక్కడ విద్యనభ్యసించనున్న గురుకుల విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పుగా మారిన డంపింగ్ యార్డును తొలగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంగళవారం బాచుపల్లిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ డిగ్రీ కళాశాల నూతన భవన సమీపంలోని డంపింగ్ యార్డును జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరితో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకున్న మంత్రి, ఆ ప్రాంతంలో కొన్ని నిమిషాలు కూడా నిలబడలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో రూ.20 కోట్ల వ్యయంతో షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల కోసం ఆధునిక హాస్టల్ నిర్మాణం పూర్తయిందని, త్వరలో గురుకుల విద్యార్థులు అక్కడికి రానున్న నేపథ్యంలో పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. స్థానికులు తమ సమస్యలను వివరించగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన మంత్రి, గతంలో చిన్నారిపై కుక్కల దాడి జరిగిన ఘటన బాధాకరమని అన్నారు. డంపింగ్ యార్డు పరిసరాలు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్నాయన్న ప్రజల ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖతో సమన్వయం చేసి ప్రత్యేక పెట్రోలింగ్ వాహనం ఏర్పాటు చేయాలని సూచిస్తానని, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తామని తెలిపారు. ప్రజల భద్రత, విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. గతంలో డంపింగ్ యార్డు తరలింపుపై అనేక ఫిర్యాదులు అందినప్పటికీ, ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటు ప్రక్రియ కారణంగా కొంత ఆలస్యమైందని చెప్పారు. ప్రస్తుతం అన్ని శాఖల సమన్వయంతో చర్యలు వేగవంతం చేసి నెల రోజుల్లో డంపింగ్ యార్డును పూర్తిగా తరలిస్తామని వెల్లడించారు. గురుకుల విద్యార్థుల సంక్షేమం, ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రమైన పరిసరాలే ప్రభుత్వ ప్రాధాన్యత" అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి మాట్లాడుతూ, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థ భవన నిర్మాణం పూర్తయిందని, డంపింగ్ యార్డు కారణంగా విద్యార్థులు, స్థానికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించామని, కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసి డంపింగ్ యార్డును త్వరితగతిన తరలిస్తామని పేర్కొన్నారు.

# ప్రైవేటు బడులు వద్దు ప్రభుత్వ బడులు ముద్దు

### జగ్గయ్యపేట గ్రామంలో బడి బాట కార్యక్రమం

#### ప్రభుత్వ బడుల్లో నాణ్యమైనా విద్య..



**రేగొండ, జూన్ 9 పీపుల్స్ డైరీ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం జగ్గయ్యపేట గ్రామంలో సర్పంచ్, పాలకవర్గము ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు కలిసి జగ్గయ్యపేట పాఠశాలకు సంబంధించిన ఆయా గ్రామాలలో ఇంటింటా తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించాలని బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రైవేటు బడులు వద్దు ప్రభుత్వ బడులు ముద్దు అని ప్రభుత్వం అందించే ఉచిత విద్యను ఉపయోగించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతు..తెలంగాణ ప్రభుత్వము 23 ఉచిత వస్తువులు విద్యార్థులకు ఈ సంవత్సరము అందించబోతుందని ఉదయం పాలు అల్పాహారం, అందిస్తారని ప్రతి సంవత్సరము పాఠశాలకు దూరంగా ఉన్న పక్క గ్రామాల పిల్లలకు రవాణా సౌకర్యాల బత్యం సంవత్సరానికి ₹6,000 వేల రూపాయలు ప్రభుత్వము మంజూరు చేస్తుందని ఎస్సీ, బీసీ విద్యార్థిని విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తుందని విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించమని సర్పంచ్ పాలకవర్గము ప్రధానోపాధ్యాయులు కోరారు . ప్రైవేటు బడులకు వద్దు ప్రభుత్వ బడులు ముద్దు అని నినాదం చేస్తూ ప్రభుత్వం అందించే ఉచిత విద్యను గుణాత్మక విద్యను డిజిటల్ విద్యను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్. ఒశీటేరు చంద్రశేఖర్, జగ్గయ్యపేట గ్రామ సర్పంచ్ నడిపెల్లి శాంతాదేవి -వెంకట్రావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం గ్రామపంచాయతీ పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి గారూ... నాకు పెన్షన్ ఇవ్వండి!

- ఆరేళ్లుగా వీల్‌చైర్‌కే పరిమితం.. అయినా కరగని అధికార యంత్రాంగం
- పెన్షన్ కోసం ఎదురుచూపులు.. ఫలితం మాత్రం శూన్యం



మేడ్చల్, (పీపుల్స్ డైరీ) : ఒక రోడ్డు ప్రమాదం అతని జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. కుటుంబాన్ని పోషిస్తూ సాధారణ జీవితం గడిపిన వ్యక్తి, ప్రమాదం తర్వాత మంచం మరియు వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడు. అయినప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు మాత్రం అతనికి అందడం లేదు. ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని 22వ వార్డు మైసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పెయ్యల శేఖర్ అనే వికలాంగుడి విషాద గాథ ఇది. ఆరు సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో శేఖర్ వెన్నుపూస తీవ్రంగా దెబ్బతింది. అప్పటి నుంచి అతను నడవలేని స్థితిలో వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడు. జీవనోపాధి కోల్పోయిన అతను వికలాంగుల ఆసరా పెన్షన్ కోసం అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి ఫలితం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

#### ఆఫీసుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు

పెన్షన్ కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత శాఖల కార్యాలయాలను ఎన్నోసార్లు ఆశ్రయించినట్లు శేఖర్ చెబుతున్నాడు. ఎమ్మెల్యే, కౌన్సిలర్, మాజీ సర్పంచ్ సహా పలువురిని కలిసి తన పరిస్థితిని వివరించినప్పటికీ, హామీలు తప్ప ఆచరణలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోతున్నాడు. "వస్తుంది... ఇస్తాం... చూస్తాం" అనే మాటలతో కాలం గడిచిపోయిందని, కానీ తనకు ఇప్పటికీ పెన్షన్ మంజూరు కాలేదని శేఖర్ కన్నీటి పర్యంతమవుతున్నాడు. అర్హుడికి అందని సంక్షేమం వీల్‌చైర్‌కే పరిమితమైన వికలాంగుడికి ఆరేళ్లుగా పెన్షన్ అందకపోవడం స్థానికులను కూడా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సంక్షేమ పథకాల అసలు లక్ష్యం ఇలాంటి నిరుపేదలు, అశక్తులకు అండగా నిలవడమేనని, కానీ అర్హులైన వారు ప్రభుత్వ సాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దురదృష్టకరమని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. శేఖర్ కుటుంబం ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. వైద్య ఖర్చులు, నిత్యావసరాల నిర్వహణ భారంగా మారడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

#### ముఖ్యమంత్రి స్పందించాలని వేడుకోలు

ప్రజాప్రతినిధులు, అధికారుల వద్ద న్యాయం దొరకకపోవడంతో శేఖర్ ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైపు ఆశగా ఎదురుచూస్తున్నాడు. తన పరిస్థితిని గుర్తించి మానవతా దృక్పథంతో వికలాంగుల ఆసరా పెన్షన్ మంజూరు చేసి తన కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు. సంక్షేమ రాష్ట్రంగా చెప్పుకునే ప్రభుత్వంలో, ఆరేళ్లుగా వీల్‌చైర్‌కే పరిమితమైన వికలాంగుడికి పెన్షన్ అందకపోవడం అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శేఖర్‌కు న్యాయం చేస్తారా అనే ప్రశ్నకు సమాధానం రావాల్సి ఉంది.

# కేంద్ర ప్రభుత్వ రైతు విధానాలను వ్యతిరేకించండి



## తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి తీగల సాగర్ పిలుపు

**గోవిందరావుపేట, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్ పిలుపునిచ్చారు, మంగళవారం గోవిందరావుపేట మండలంలోని పీఎస్ఆర్ గార్డెన్లో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశా నికి గుండు రామస్వామి అధ్యక్షతన వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల మద్దతు ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం జరిగింది అన్నారు, మొక్కజొన్నలు గతంలో క్వింటాలుకు 2400 రూపాయలు ఉండగా కేవలంఈ సంవత్సరము 10 రూపాయలు అదనంగా పెంచిందని దీనికి ప్రధాన కారణం భారత్ అమెరికా ఒప్పందం ప్రకారం మొక్కజొన్నలు దేశానికి దిగుమతి చేసుకోవడానికి విదేశీ దేశాలకు అనుమతిస్తూ భారతదేశ రైతంగానికి ధరలు పెంచకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు.ఒక ప్రక్క ఎరువుల, పురుగు మందుల సబ్సిడీలు తగ్గిస్తూ ఎరువుల ధరలు రైతులకు అందుబాటు లేకుండా పెరిగి పోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు,మద్దతు ధరలు మాత్రం ఏమాత్రం పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా ములుగు జిల్లాలో ప్రధానంగా గతంలో ప్రభుత్వం ధరణి తెచ్చి రైతుల కాస్తు కాన తీసివేసి రైతులను బిచ్చగాళ్ళని చేసింది ఇది బంగాళాఖాతంలో ధరణి పడేసి భూభారతి తెచ్చి రైతులకు న్యాయం చేస్తారని గతంలో 12 లక్షల మంది రైతులు సాదా బైనమా దరఖాస్తు పెట్టుకుంటే నేటికీ వారికి పట్టాలి ఇవ్వడం లేదని తెలిపారు, ఏజెన్సీలో రైతులు ఎలాంటి హక్కులు లేక రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు, ఆరుగాలం పండించిన పంట చేతికొచ్చి అమ్ముకుందామంటే పట్టాలు లేవని ప్రభుత్వం నుండి ఎలాంటి పథకాలు రైతులకు అమలు కావడం లేదని వెంటనే ప్రభుత్వం భూమికాస్తు కాలం ఏర్పాటు చేసి రైతులకు రెవెన్యూ రికార్డు ప్రకారంగా కనీసం మీసేవ పహాని నకల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా 2025 లో వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు, యెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు కార్యక్రమంలో తుమ్మల వెంకట్ రెడ్డి తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎండి యాకూబ్, సురేష్,ఊకే నాగేశ్వరరావు, జన్న ఎల్లయ్య,ఖ్యాతం సూర్యనారాయణ, ఐలయ్య సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు,



## నల్లబెల్లి కాంగ్రెస్ ఎస్సీ సెల్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**నల్లబెల్లి జూన్ 09 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు, నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చరణ్ సింగ్ అధ్యక్షతన మండల ఎస్సీ సెల్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రానికి చెందిన పరికి పవన్‌ను మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యుల వివరాలను ప్రకటించారు. మండల అధ్యక్షుడుగా పరికి పవన్, ఉపాధ్యక్షులుగా గంధం కుమార్, నత్తి చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా కానుగంటి రాజు, కార్యదర్శులుగా కలకోటి స్వామి, ఎర్ర శివ,కోశాధికారి ములుగు సుభాష్, జిల్లా కమిటీ సభ్యులు దండెం రవీందర్, బోట్ల నరేష్, బాడిశ కుమార స్వామి పార్టీ బలోపేతానికి, దళితుల సంక్షేమానికి నూతన కమిటీ అహర్నిశలు కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉప-సర్పంచ్‌లు, కాంగ్రెస్ గ్రామ కమిటీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విశిష్ట సాహితీ సేవా పురస్కార గ్రహీతకు ఘన సన్మానం



**గణపురం, జున్ 09 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ కవి మాదాసు లక్ష్మణ్ గౌడ్ ను అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలో మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల చైతన్య సరస్వతి పరిషత్, శ్రీశ్రీ కళా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 6, 7 తేదీల్లో నిర్వహించిన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో భాగంగా రాజమండ్రిలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మణ్ గౌడ్‌కు విశిష్ట సాహితీ సేవా పురస్కారం లభించిన సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం నాయకులు మాట్లాడుతూ... బహుజన బీసీ బిడ్డగా గుర్తింపు పొందిన మాదాసు లక్ష్మణ్ గౌడ్ తన కవిత్వం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో చైతన్యం కల్పించడంతో పాటు బహుజనుల ఐక్యతకు కృషి చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా సామాజిక మార్పు, సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్న తిని ప్రతిబింబించే రచనలు చేయాలని ఆకాంక్షించారు. పురస్కారం అందుకోవడం పట్ల లక్ష్మణ్ గౌడ్ హర్షం వ్యక్తం చేస్తూ, తన రచనలు సమాజ ప్రయోజనాలకే అంకితమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్ల శంకరయ్య, దూడపాక దుర్గయ్య, ముప్పిడి శంకర్, గడ్డం సదయ్య, దూడపాక శ్రీనివాస్, చిలువేరు ఉదయాకర్, ఊరడి మురళి, ఎలుక పెల్లి రఘుపతి, బొచ్చు సాంబయ్య, కుర్రి అశోక్, అక్కపాక సుధాకర్, జన్నే రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ప్రభంజనం

## సద్గురు క్రషర్ అక్రమాలపై మైనింగ్ అధికారుల కొరడా!

**ప్రజావాణి ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం**

**గతంలో కూలిన బావులు, నూతన నిర్మించుకున్న బావి బీటలు, ఇళ్ల బీటను స్వయంగా పరిశీలించిన అధికారులు**

**సామాన్యుడి ఆయుధం 'ప్రజావాణి' అని నిరూపించిన అర్వణపల్లి ఘటన**



**కేసముద్రం, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి ఒక తిరుగులేని ఆయుధంగా మారింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్వణపల్లి గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టరేట్‌లో తాము ఎదుర్కొంటున్న నరకాన్ని ఆధారాలతో సహా ప్రజావాణిలో విన్నవించగా, మైనింగ్ శాఖాధికారులు మెరుపు వేగంతో స్పందించారు.

### కళ్లముందు కనిపించిన నష్ట తీవ్రత

గ్రామస్తుల ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయి విచారణకు వచ్చిన మైనింగ్ ఏడీ వెంకటరమణ, ఏజీ నిరంజన్ బృందానికి స్థానికులు సద్గురు క్రషర్ మిల్లు చేస్తున్న అరాచకాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు.

### కూలిపోయిన బావులు పగిలిన ఓడలు

గతంలో క్రషర్ యాజమాన్యం జరిపిన భారీ రిగ్ బ్లాస్టింగ్‌ల తీవ్రతకు సాగునీరు, 22 ఓడల బావి కూలడం జరిగింది. నూతనంగా నిర్మించిన బావి 24 ఓడలలో 6 ఓడలు భారీ బ్లాస్టింగ్ వలన పగుళ్లు వైనాన్ని అధికారులు స్వయంగా చూశారు.

### బీటలు వారిన నూతన గృహాలు

పేద ప్రజలు ఎన్నో ఆశలతో, కష్టపడి నూతనంగా నిర్మించుకున్న ఇళ్లు సైతం ఈ బ్లాస్టింగ్ ధాటికి నిలువునా చీలిపోయి, గోడలు పగుళ్లు వారడాన్ని చూసి అధికారులు దిగ్భ్రాంతి చెందారు.బాధితుల ఆవేదనను స్వయంగా ఆలకించి, నష్టాన్ని ప్రాథమికంగా ధృవీకరించిన మైనింగ్ ఏడీ వెంకటరమణ తీవ్రంగా స్పందించారు. ప్రజల ప్రాణాలతో, ఆస్తులతో ఆడుకునే ఎంతటి వారినైనా సహించేది లేదని హెచ్చరించారు. సద్గురు క్వారీ లీజు రికార్డులు, బ్లాస్టింగ్ అనుమతులు, నిబంధనల ఉల్లంఘనలపై పూర్తిస్థాయి దర్యాప్తుకు ఆదేశించారు. వారం రోజుల్లో సమగ్ర నివేదికను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు, క్వారీపై చట్టపరమైన ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు.ఏళ్ల తరబడి సాగుతున్న అక్రమాలపై స్థానిక ప్రజలు ఎన్నో మార్లు ఆందోళనలు చేసినా స్పందన కరువైంది. కానీ, ఎప్పుడైతే బాధితులు ప్రజావాణిని ఆశ్రయించారో, అప్పుడే యంత్రాంగం లో కదలిక వచ్చింది. అధికారుల ఈ ఆకస్మిక తనిఖీ మరియు కఠిన వైఖరితో అర్వణపల్లి గ్రామస్తుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి. ప్రభుత్వ వ్యవస్థలపై, ప్రజావాణిపై మాకు నమ్మకం పెరిగింది. మాకు న్యాయం జరుగుతుందనే ధీమా వచ్చింది అని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## ధన్నసరి సొసైటీకి ఇన్‌చార్జి సీఈవోగా ఆకుల రాంబాబు

**కేసముద్రం, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రంలోని ధన్నసరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇన్‌చార్జి సీఈవోగా సొసైటీ సిబ్బందిలో సీనియర్ అయిన ఆకుల రాంబాబుకు జిల్లా అధికారులు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ సీఈవోగా సుదీర్ఘకాలం పనిచేసిన గోపాల మల్లారెడ్డి ఇటీవల పదవీ విరమణ పొందడంతో వారం రోజులుగా ఖాళీగా ఉన్న ఈ స్థానాన్ని తాత్కాలికంగా భర్తీ చేశారు. ధన్నసరి సొసైటీ జిల్లాలో ప్రముఖ సొసైటీలలో ఒకటి. సొసైటీకి శాశ్వత సీఈవోను నియమించాలని రైతులు కోరుతున్నారు.

# అర్వణపల్లి రూపురేఖలు మార్చిన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి



**కేసముద్రం, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి తన సొంత గ్రామం అర్వణపల్లి అభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి చేశారు. గ్రామంలో చదువుకు పాఠశాలను ఆధునిక సౌకర్యాలతో తీర్చిద్దారు. కొత్త తరగతి గదులు, స్మార్ట్ క్లాసులు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు సంతోషంగా చదువుకుంటు న్నారు. భక్తికి నిలయమైన గ్రామ దేవాలయాన్ని నూతనంగా నిర్మించారు. విశాల ప్రాంగణం, భక్తులకు కూర్చునే వసతి, లైటింగ్ సౌకర్యాలు కల్పించారు. పండగల సమయంలో వేలాది మంది భక్తులు వచ్చి దర్శనం చేసుకుంటున్నారు.ఇన్నాళ్లు గ్రామ ప్రజలను ఇబ్బంది పెట్టిన వడ్ల వాగు సమస్యకు బ్రిడ్జి నిర్మాణంతో శాశ్వత పరిష్కారం దొరికింది. బ్రిడ్జి పక్కనే డబుల్ రోడ్లు వేయడంతో వర్షాకాలంలోనూ రాకపోకలు సుగమంగా సాగుతున్నాయి. రైతులు, విద్యార్థులు, రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు మాటల మనిషి కాదు చేతల నాయకుడు అంటూ ప్రశంసిస్తున్నారు. అర్వణపల్లి ముద్దుబిడ్డ అభివృద్ధికి బ్రాండ్ అని గ్రామమంతా గర్వంగా చెప్పుకుంటుంది. చదువుకు స్కూలు, భక్తికి గుడి, ప్రయాణానికి బ్రిడ్జి రోడ్లు అంటూ అర్వణపల్లి కొత్త రూపు సంతరించుకుంది.



## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్**

**మట్టెవాడ, జూన్ 09 (పీపుల్స్ డైరీ):** ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ మండల ఎంఈఓ వెంకటేశ్వర్లుకి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగంలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలనీ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలి, ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి, విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను అరికట్టాలి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందుబాటులోకి తేవాలని శరత్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ నాయకుడు సిహెచ్.హరీష్, మేకల అభినవ్ రాకేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్



**మట్టెవాడ, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** త్రైమాసిక తనిఖీ షెడ్యూల్‌లో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మంగళవారం ఎనుమాముల మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎం గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, ప్రవేశ నియంత్రణ చర్యలను పరిశీలించారు. గోదాం వద్ద అమలులో ఉన్న భద్రతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణపై పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని నిబంధనలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్యారాణి, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, ఎన్నికల విభాగ డిటి రంజిత్, సంబంధిత అధికారులు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పీఎంరాష్ట్రీయ బాల్ పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**మట్టెవాడ, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** దేశ నిర్మాణంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన బాలలను గుర్తించి ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ (పిఎంఆర్.బిపి)-2026 కోసం నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. ధైర్యసాహసం, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు-సంస్కృతి, విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరిచిన 18 సంవత్సరాల లోపు బాలలు ఈ పురస్కారానికి అర్హులని ఆమె పేర్కొన్నారు. అర్హులైన బాలల ప్రతిభను జాతీయ స్థాయిలో గుర్తించి గౌరవించేందుకు ఈ అవార్డులు అందచేయబడతాయని తెలిపారు. నామినేషన్లు రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించబడతాయని, అర్హులైన బాలల వివరాలను సంబంధిత అధికారులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు గుర్తించి సిఫారసు చేయాలని కోరారు. బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలు, దివ్యాంగులలోని ప్రతిభా వంతులను ప్రత్యేకంగా గుర్తించి నామినేషన్లు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్-2026 నామినేషన్లకు జూలై 31, 2026 చివరి తేదీ కాగా, జిల్లా స్థాయిలో పరిశీలన కోసం సంబంధిత వివరాలను జూన్ 30, 2026లోగా కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు.

## 20న 2వ జాతీయ లోక్ అదాలత్

**మట్టెవాడ, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో, హైకోర్టుతో సహా 2026 జూన్ 20న 2వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా వివిధ రకాల సివిల్, రాజీకి అనువైన క్రిమినల్, మోటారు ప్రమాద పరిహారం, బ్యాంకు రుణాలు, కుటుంబ వివాదాలు తదితర కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని ఆమె కోరారు. సంబంధిత శాఖలు, అధికారులు, న్యాయ సేవా సంస్థలు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గరిష్ట సంఖ్యలో ప్రజలు పాల్గొని లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సత్యశారద తెలిపారు.

## మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుల అండ

**50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, నగదు సాయం అందజేత**



**నర్సింహులపేట, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని జయపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన మందుల నర్సయ్య, మందుల ముత్తయ్య మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు పార్టీ అండగా నిలుస్తుందని, ఎలాంటి కష్టసమయంలోనైనా తోడుగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు, నగదు సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చుక్క వెంకన్న, సర్పంచ్ రేణుక అశోక్‌రెడ్డి, ఉపసర్పంచ్ చుక్క వేణు, నెలకుర్తి వెంకటరెడ్డి, బొల్లం వాసు, రాచమల్ల భద్రయ్య, బాల్లె ఐలయ్య, లింగారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాచమల్ల వెంకన్న, చుక్క మధుసూదన్, నకెరకంటి నాగరాజు, చుక్క అశోక్, మందుల రామ్మూర్తి, దారం మల్లయ్య, చుక్క శ్రీకాంత్, మందుల నరేష్, మందుల వెంకన్న, వార్డు సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# “ప్రజల భరోసా కేంద్రంగా పోలీస్ స్టేషన్లు ఉండాలి”

## గణపురం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**గణపురం, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** “ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు పట్ల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదు” అని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ అన్నారు. మంగళవారం గణపురం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ అక్కడి పరిపాలనా వ్యవహారాలు, రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు తీరు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మొదటగా స్టేషన్‌లోని వివిధ రిజిస్టర్లు, కేసు డైరీలు, ఎఫ్ఐఆర్ నమోదు పత్రాలు, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించిన ఎస్పీ, దర్యాప్తు దశలో ఉన్న కేసులపై అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి వాటి దర్యాప్తును వేగవంతం



చేయాలని సూచించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు కేసుల విచారణలో నాణ్యత, పారదర్శకత పాటించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కార ప్రక్రియపై కూడా ఎస్పీ ఆరా తీశారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరమైన పరిష్కారం చూపించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో అనవసర జాప్యం చోటుచేసుకోకుండా చూడాలని, బాధితులకు పోలీసు శాఖపై నమ్మకం పెరిగేలా సేవలు అందించాలని స్పష్టం చేశారు. అనంతరం స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. రాత్రి గస్తీ, నిఘా వ్యవస్థ, అనుమానితుల కదలికలపై పర్యవేక్షణ, సీసీ కెమెరాల వినియోగం వంటి అంశాలపై అధికారుల నుంచి వివరా లు తెలుసుకున్నారు. నేరాలను అరికట్టడంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని, సీసీ కెమెరాలు ఎల్లప్పుడూ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కెమెరాల ద్వారా లభించే సమాచారాన్ని సమర్థవంతంగా వినియోగించి నేరస్థులను గుర్తించే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాల నియంత్రణ వంటి అంశాల పైనా ఎస్పీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. మహిళలు, వృద్ధులు, బలహీన వర్గాలకు సంబంధించిన ఫిర్యాదుల విషయంలో సున్నితం గా స్పందించాలని, చట్టబద్ధమైన చర్యలను వేగంగా చేపట్టాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బందికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను కూడా ఎస్పీ పరిశీలించారు. ఈ తనిఖీలో సీఐ కరుణాకర్ రావు, ఎస్ఐ అశోక్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## మండల కేంద్రంలో బడిబాట

**గోవిందరావుపేట, జూన్ 9(పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని లక్ష్యంతో మంగళవారం మండల కేంద్ర ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని బడిబాట కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది, అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు పాఠ్య పుస్తకాల పంపిణీ, పాఠశాల యూనిఫారాలు డబ్బులు లేకుండా అందజేయనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ర రఘురాం అన్నారు.

## కల్వర్టు పనులను ప్రారంభించిన సర్పంచ్



**గణపురం, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలోని అంజిరెడ్డి కాంప్లెక్స్ ఎదురుగా నూతనంగా చేపడుతున్న కల్వర్టు పనులను మంగళవారం స్థానిక సర్పంచ్ కటుకూరి రాధిక శ్రీనివాస్ ప్రారంభించారు. దశాబ్దాల కాలంగా నల్ల నీటికి నోచుకోని వడ్డెర కాలనీకి సర్పంచ్ రాధిక శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో నూతన పైపుల నిర్మాణం చేపట్టి ఇంటింటికి నల్లా నీరు అందించారు. అంతకుముందు హైదరాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహిళా సంఘాలకు బస్సుల పంపిణీ కార్యక్రమానికి వెళ్తున్న మహిళా సమాఖ్య సంఘాల ఆర్టీసీ బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ఇమామ్, సీసీ లు బాబా, శకుంతల, మాజీ కోఆప్షన్ సభ్యులు చోటే మియా, వార్డు సభ్యులుగంధం ఓధాకర్, నాయకులు ఆవుల రవి కిరణ్, దూడపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలు

### చెల్పూర్-గొల్లపల్లి రహదారిపై ప్రమాదం



**గణపురం, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని చెల్పూర్-గొల్లపల్లి రహదారిపై మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... గొల్లపల్లి గ్రామానికి చెందిన గాజర్ల కమలాకర్ తన భార్య మానస లక్ష్మి, కుమారుడు సిద్దిక్, కూతురు సాత్వికతో కలిసి చెల్పూర్‌లో కొనుగోళ్లు పూర్తి చేసుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో చెల్పూర్-గొల్లపల్లి రహదారిపై ఎదురుగా నారాయణపురం వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వారి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రతకు బైక్‌పై ఉన్న నలుగురు రోడ్డుపై పడిపోగా తీవ్ర రక్తగాయాలయ్యాయి. చిన్నారులు సహా కుటుంబ సభ్యులు గాయపడటంతో అక్కడి ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను రోడ్డుపై నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి భూపాలపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు.

## కంకర పోశారు ... రోడ్డు పోయడం మరిచారు!



**కేసముద్రం, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పణపల్లిలో వేసిన డబుల్ రోడ్డు మరణశాసనంగా మారింది. కంకర పోసి తారు వేయకుండా వదిలేయడంతో రోడ్డంతా గుంతలమయం అయింది. వాహనాలు బోల్తా పడుతున్నాయి, ప్రజలు గాయపడుతున్నారు. రోడ్ల బాధతో అర్పణపల్లి ఆటో యూనియన్ ధర్నాకు దిగింది. ప్రతిరోజు గుంతల్లో ఆటో నడపాలంటే వాహనం పూర్తిగా పాడైపోతుంది. మరమ్మతులకు సంపాదన అంతా సరిపోతుంది. గర్భిణీలు, వృద్ధులు ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుంది అని ఆటో డ్రైవర్లు కన్నీరు పెట్టుకున్నారు. కొత్త ఆటోలు కొని సొంత కాళ్లపై నిలబడాలని కలలు కంటున్న డ్రైవర్లకు కంకర రోడ్లు శాపంగా మారాయి. అద్దె కట్టే బాధ పోయినా, రోడ్డు గుంతలు కొత్త బాధ తెచ్చిపెట్టాయి. డబుల్ రోడ్డు అని మొదలు పెట్టి కంకరతో వదిలేశారు. వెంటనే మరమ్మతులు చేయకపోతే చలో కలెక్టరేట్ కు వెళ్తాం అని ఆటో యూనియన్ ప్రజలు హెచ్చరిస్తున్నారు. రోడ్డు బాగుపడితే ఆటో బతుకుతుంది ప్రజలు బతుకుతారు. అధికారులు కళ్లు తెరవాలని డిమాండ్ చేస్తున్నారు.

## నెల రోజులు కావస్తున్నా పూర్తికాని సిసి పనులు

### కంకర పనులు చేపట్టారు .. సీసీ పనులు మరిచారు..!



**గోవిందరావుపేట, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధి పసర నాగారం గ్రామపంచాయతీ ఐదవ వార్డులో నెల రోజులుగా వస్తున్నప్పటికీ నేటికి సంబంధిత కాంట్రాక్టర్ సీసీ పనులు చేయి పెట్టకపోవడంతో వీధి వెంట నడవడానికి అనేక ఇబ్బందులకు గురి అగు చున్నామని వార్డు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, అంతేకాకుండా పసర గ్రామపంచాయతీలో అనేక వార్డు వార్డుల్లో సీసీ పనులు చేపట్టినప్పటికీ సంబంధిత గుత్తే సీసీ రోడ్లపై నీరు పోయలేకపోవడంతో ఆయా వార్డుల ప్రజలు బీటలు భారీ పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, కోట్లాది రూపాయల రాష్ట్ర ప్రభుత్వం నుండి వెచ్చించి సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించి నప్పటికీ నాణ్యత ప్రమాణాలతో పాటు, సీసీ రోడ్లపై క్యూరింగ్ చేయకపోవడం నాణ్యత ప్రమాణాలు కూడా పాటించ కొండ గుత్తే దారు ఇష్టానుసారంగా పనులు చేపట్టడంతో పాటు సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని దీనితో నాణ్యత ప్రమాణాలు లోపించి మున్నా ళ్ల ముచ్చటగా మారే అవకాశం ఉందని వెంటనే సంబంధిత శాఖ అధికారులు విచారణ జరిపి సి సి రోడ్డు పనులు నాణ్యత ప్రమాణాలు పాటించేందుకు చర్యలు గైకొనాలని ప లు గ్రామాల ప్రజలు వినతి కోరుతున్నారు.



## నేటి ధర్నాను జయప్రదం చేయండి : చంద్రశేఖర్

**చెన్నూరు జూన్ 09(పీపుల్స్ డైరీ) :** పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్, నిత్యావసర ధరల పెంపును వ్యతిరేకిస్తూ ఈనెల 10న మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రేగుంట చంద్రశేఖర్ చెన్నూరు ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. సిపిఐ పార్టీ నాయకులు ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ధర్నాకు ప్రజలు మద్దతుగా నిలిచి అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచడం వల్ల నిత్యావసర ధరలు పెరిగి సామాన్య ప్రజలపై భారం పడుతుందని, కేంద్ర ప్రభుత్వం ధరలు నియంత్రణ చేయడంలో విఫలమైందని, కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నెన్నెల సమ్మయ్య, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, పట్టణ కార్యదర్శి సుంకరి చందు, మండల సహాయ కార్యదర్శి బడికెల బానయ్య, జిల్లా సమితి సభ్యులు అందె పురుషోత్తం, సూత్రల నారాయణ పాల్గొన్నారు.

## రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు

### మంత్రులు తుమ్మల, పొంగులేటి

**ఖమ్మం, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు అందనున్నాయని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఏదులాపురం మునిసిపల్ ప్రాంతంలోని కరుణగిరిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ (డీసీసీబీ) నూతన శాఖను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రైతులు, స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులు, సాధారణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో ఈ నూతన శాఖ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సహకార బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు నాణ్యమైన ఆర్థిక సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సహకార రంగం అభివృద్ధి చెందితే రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని, వ్యవసాయ రుణాలు, పొదుపు పథకాలు, ఇతర బ్యాంకింగ్ సేవలు ప్రజలకు సత్వరంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రులు వెల్లడించారు. డీసీసీబీ విస్తరణతో స్థానిక ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., సిపి సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ నవీన్, డీసీఓ గంగాధర్, ప్రజా ప్రతినిధులు, రైతులు, సంబంధిత అధికారులు, ప్రజలు, తదితరులున్నారు.



## సింగరేణిలో “రక్తపింజార”లాంటి అధికారులు...!

**ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం..!**

**కార్మికుల ప్రాణాలకు భరోసా ఏది..?**

**సమస్యలను ఎవరికి వినిపించాలి..?**

**వృద్ధురాలు మృతికి స్థానిక సింగరేణి అధికారులే బాధ్యత వహించాలి**

**మాజీ జెడ్పిటీసీ పాల్వంచ దుర్గ ఆగ్రహం**



**మణుగూరు, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** సింగరేణి సంస్థను దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థల్లో ఒకటిగా చెప్పుకుంటున్నప్పటికీ, మణుగూరు ఏరియాలో కొందరు అధికా రులు “రక్తపింజార”లా వ్యవహరిస్తూ కార్మిక కుటుంబాల సమస్యలను పూర్తిగా విస్మరిస్తున్నారని మాజీ జెడ్పిటీసీ పాల్వంచ దుర్గ తీవ్ర స్థాయిలో విమర్శిం చారు. మంగళవారం విలేకరులతో మాట్లా డిన ఆమె, సింగరేణి కార్మిక కాలనీల్లో నెలకొన్న సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ స్థానిక అధికారులు స్పందించకపోవడం దురదృష్టకర మని అన్నారు. మణుగూరు ఏరియా పరిధిలోని పీవీ కాలనీలో కార్మికులు నివసిస్తున్న ప్రాంతాలకు సరైన ప్రహరీ గోడ లేకపోవడం వల్ల పాములు, పందు లు, ఆవులు, గేదెలు వంటి జంతువులు తరచూ కాలనీల్లోకి ప్రవేశిస్తున్నాయని ఆమె తెలిపారు. ఈ సమస్యపై పలుమా ర్లు సింగరేణి జీఎం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనలో సింగరేణి అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపించిన దుర్గ, కాలం చెల్లిన క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకుని కార్మికుల ప్రాణాలకు ముప్పుగా మారాయని పేర్కొన్నారు. సరైన నిర్వహణ లేకపోవడంతో పశువులు స్వేచ్ఛగా సంచరిస్తూ కార్మిక కాలనీలను అడ్డాలుగా మార్చుకున్నాయని ఎద్దేవ చేశారు. మంగళవారం పీవీ కాలనీలో ఆవు పొడవడంతో ఓ వృద్ధురాలు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్న ఆమె, ఈ ఘటనకు స్థానిక సింగరేణి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకుని ఉంటే ఈ విషాదాన్ని నివారించవచ్చని అభిప్రాయపడ్డారు. కార్మికుల ప్రాణాలు, వారి కుటుంబాల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై బాధ్యత నిర్ధా రించాలని, వృద్ధురాలి మృతిపై ఉన్న తస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. బొగ్గు ఉత్పత్తికి తమ జీవితా లను అంకితం చేస్తున్న కార్మికుల కుటుం బాలకు కనీస భద్రత కూడా కల్పించ లేకపోతే యాజమాన్యం బాధ్యత ఏమి టి?” అని ఆమె ప్రశ్నించారు. అలాగే, ఉన్నతాధికారుల క్వార్టర్లకు ఒక న్యాయం, కార్మికుల నివాసాలకు మరో న్యాయమా?” అని ప్రశ్నించిన పాల్వంచ దుర్గ, కార్మికుల సమస్యల పట్ల యాజమా న్యం వివక్షతో వ్యవహరిస్తోందని ఆరో పించారు. ఉన్నతాధికారుల నివాస ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు ఉండగా, కార్మికుల కాలనీలు మాత్రం నిర్లక్ష్యానికి గురవుతున్నాయని అన్నారు. సింగరేణి అభివృద్ధికి శ్రమిస్తున్న కార్మికుల ప్రాణాలు, వారి కుటుం బాల భద్రత కంటే ముఖ్యమైనది మరొ కటి లేదని పేర్కొంటూ, అధికారులు ఇక నైనా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. అలాగే కార్మిక కాల నీల్లో వెంటనే ప్రహరీ గోడల నిర్మాణం, కాలం చెల్లిన క్వార్టర్ల మరమ్మతులు లేదా పునర్నిర్మాణం, పశువుల నియంత్రణ, భద్రతా చర్యల బలోపేతం, మౌలిక సదుపాయాల కల్పన చేపట్టి కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించాలని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, డైరెక్టర్లకు పాల్వంచ దుర్గ విజ్ఞప్తి చేశారు.

# ప్రజా నమ్మకమే ఈ ప్రభుత్వ బలం

## మీడియా సమావేశంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తోందని, ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' విజయవంతం కావడమే నిదర్శనమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురామ్ రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ జూలై 12 నాటికి పూర్తి కాబోతోందని వెల్లడించారు.

### 14 క్లస్టర్లలో వెల్లువెత్తిన జనసందోహం.. 24వేల పైచిలుకు దరఖాస్తులు

పాలేరు నియోజకవర్గాన్ని 14 క్లస్టర్లుగా వర్గీకరించి, గత 25 నుండి 30 రోజులుగా 'ప్రజల వద్దకే ప్రభుత్వం' అనే నినాదంతో ప్రజా దర్బార్ నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. సోమవారంతో ఆఖరి విభాగం పూర్తయిందని, ఈ కార్యక్రమాల ద్వారా దాదాపు 25వేల మంది ప్రజలను తాను వ్యక్తిగతంగా కలిసి, వారి సమస్యలను స్వయంగా కళ్లారా చూసి, చెవులారా విన్నానని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రజా దర్బార్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి మొత్తం 24వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 11,000 అర్జీలు, ఆసరా పింఛన్ల కోసం 5,200 అర్జీలు అందినట్లు వివరించారు. అలాగే గృహజ్యోతి పథకం దరఖాస్తులతో పాటు అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, తాగునీరు వంటి స్థానిక సమస్యలపై కూడా ప్రజలు పెద్ద ఎత్తున వినతులు సమర్పించారని చెప్పారు.

### భూ భారతి చట్టంతో సాదాబైనామాల సమస్యకు శాశ్వత పరిష్కారం

గత ప్రభుత్వం ధరణి చట్టం తెచ్చే ముందు సాదాబైనామాల అప్‌లోడ్‌కు అవకాశం ఇచ్చి, ఆ తర్వాత చట్టంలో చేర్చకుండా రైతులను గాలికి వదిలేసిందని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 9,26,000 సాదాబైనామా దరఖాస్తుల సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రి మండలి నిబంధనలను సవరించిందని తెలిపారు. గతంలో భూమి అమ్మిన వారి సమ్మతి కూడా కావాల నే నిబంధన ఉండేదని, కానీ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అమ్మిన వారి సమ్మతి అవసరం లేకుండా నిబంధనలు మార్చామన్నారు. ఇప్పటికే ఐదున్నర లక్షల దరఖాస్తులను గుర్తించి నోటీసులు ఇచ్చామని, మిగిలిన వాటికి మరో 15 రోజుల్లో నోటీసుల ప్రక్రియ పూర్తవుతుందని, చట్టప్రకారం 30 రోజుల నోటీసు గడువు తర్వాత అర్హులైన అన్ని సాదాబైనామాలను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

### ఆధునిక డిజిటల్ సర్వే.. సాగులో ఉన్న వారికే భూమి పట్టాలు

తరతరాలుగా భూమి సాగులో ఉన్నా పట్టా పుస్తకాలు రావట్లేదని ఆవేదన చెందుతున్న రైతుల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి ఆధునిక భూ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం (కాకరవాయి) గ్రామంలో ఇప్పటికే ఈ సర్వే విజయవంతంగా పూర్తయిందన్నారు. క్షేత్రస్థాయిలో సాగులో ఉన్న వారికే పట్టా పుస్తకాలు ఇస్తూ, లేని వారివి రద్దు చేసే చట్టాన్ని తెచ్చామని, ప్రజా దర్బార్‌లో వచ్చిన 4,300 భూ సమస్యల దరఖాస్తుల్లో దాదాపు 2,300 అప్లికేషన్లను ప్రత్యేక కార్యాచరణ ద్వారా త్వరలోనే పరిష్కరించబోతున్నామని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ అవసరాల కోసం కొంత భూమి సేకరిస్తే ఆ సర్వే నెంబర్ మొత్తం నిషేధిత జాబితాలో పెట్టే పాత విధానాన్ని సవరించి, పట్టా భూములను ఆ నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియను దాదాపు పూర్తి చేశామన్నారు.

### నిర్ణీత కాలపరిమితిలోగా గృహాలు, ఇళ్ల స్థలాల కేటాయింపు

ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి అధికారుల యంత్రాంగాన్ని విభజించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కనీసం 45 రోజుల సమయం పడుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన వారి దరఖాస్తులను విడతలవారీగా అందజేస్తామని, అలాగే ఇళ్ల స్థలాల కోసం 1,500 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించామని, ఎక్కడైతే నివాసానికి యోగ్యమైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో వాటిని సేకరించి రాబోయే కొద్ది రోజుల్లో ఇళ్ల స్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

### ప్రతిపక్షాల బురదజల్లే రాజకీయాలను తిప్పికొట్టిన ఓటర్లు

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రజాప్రతినిధులు, పదేళ్లు దొరపాలన సాగించిన మాజీ మంత్రులు రాజకీయ దురుద్దేశంతో, స్వలాభం కోసం ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని, వారి మాటల్లో ఎలాంటి నిజం లేదని మంత్రి కొట్టిపారేశారు. ప్రతిపక్షాలు చేసే విమర్శల్లో ప్రజలకు ఉపయోగపడే న్యాయమైన అంశాలు ఉంటే పంతాలకు పోకుండా సానుకూలంగా తీసుకుని తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన వారు కేవలం కాంగ్రెస్ శ్రేణులు మాత్రమే కాదని, అన్ని పార్టీలకు చెందిన పేద ప్రజలు ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో వచ్చారని మంత్రి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ఈ ప్రభుత్వం ఖచ్చితంగా మా సమస్యలు తీరుస్తుందనే అచంచల విశ్వాసం ప్రజల్లో కనిపించిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికలు.. ఏవైనా సరే ఓటరు స్పష్టమైన తీర్పుతో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## ఏన్కూరు ఎస్బిఐ జనరేటర్ దగ్ధం



**ఏన్కూరు జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరులోని ఎస్బిఐ బ్యాంకు జనరేటర్ మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. తొలుత పొగలు రావడాన్నీ పక్కన గదులలో ఉంటున్న వారు గమనించి విద్యుత్ సరఫరా నిలిపి వేయించారు. స్థానికులు,బ్యాంకు సిబ్బంది స్పందించి మంటలను ఆర్పి వేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు అయింది. బయట ఉన్న జనరేటర్ దగ్ధమవుతున్న సమయంలో బ్యాంకు లోపల అధికారులు సిబ్బంది విధులలో నిమగ్నమై ఉన్నారు. ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే మంటలను ఆర్పి వేశారు.

## ఎన్నికలు జరగని పంచాయతీలకు 17 లక్షల మంజూరు



**ఏన్కూరు, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరు మండలంలో ఎన్నికలు జరగని ఏన్కూరు, నాచారం, జన్నారం, ఆ రికాయలపాడు గ్రామ పంచాయతీలకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సిఫారసు మేరకు 17 లక్షలు ఎస్ఎస్ బి నిధులు మంజూరు అయ్యాయని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు స్వర్ణ నరేందర్ తెలిపారు. ఈ గ్రామపంచాయతీలలో తాగునీటి ఎద్దడి నివారణకు నిధులు మంజూరి అయ్యాయని తెలిపారు. చేతి పంపుల మరమ్మతులు, బోర్లు, మోటార్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి చొరవతో ఏన్కూరు, జన్నారం, శ్రీరాంపురం తండా, నూకలంపాడు, తిమ్మారావుపేట గ్రామాలలో బోర్లు మంజూరు అయ్యాయని నరేందర్ తెలిపారు. ఎమ్మెల్యేకు, ఎంపీ కు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## జూన్ 14న ఇల్లందులో రాష్ట్రస్థాయి నృత్య పోటీలు

### మంత్రి పొంగులేటి చేతుల మీదుగా నృత్య పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** కీర్తిశేషులు బాల, సాయి జ్ఞాపకార్థం వెంకట్ డ్యాన్స్ అకాడమీ (వీడీఏ), వీబీసీసీ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న ఇల్లందులోని సీఈఆర్ క్లబ్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కళలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను పెంపొందిస్తాయని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రతిభావంతులైన కళాకారులకు ఇటువంటి పోటీలు తమ ప్రతిభను ప్రదర్శించుకునేందుకు మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు కదారి వెంకటేష్ మాట్లాడుతూ జూన్ 14న ఉదయం 9 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. వెస్ట్రన్, ఫోక్, క్లాసికల్ విభాగాల్లో జూనియర్, సీనియర్ కేటగిరీలతో పాటు సోలో, డ్యూయెట్ ప్రదర్శనలకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల నృత్య కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ డాన్స్ మాస్టర్లు శేఖర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలి : ప్రభాకర్‌రెడ్డి



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** ఇల్లందు పట్టణ అధ్యక్షురాలు సుచిత్ర అధ్యక్షతన మంగళవారం జరిగిన పట్టణ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పాలనలో దేశం సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, భారతదేశ ప్రతిష్ఠను ప్రపంచ స్థాయిలో పెంపొందించడంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల గురించి వివరించారు. అలాగే పార్టీ కార్యకర్తలు ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా వివరించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ ఇంచార్జ్ జిల్లా ఉపాధ్యక్షులు భుఖ్య శ్రీను నాయక్, గోపికృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రాథోడ్, దోమల మహేష్, మండల ప్రధాన కార్యదర్శి లు కార్యవర్గ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు



## దళారులను నమ్మి మోసపోవద్దు

### పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు : గోడిశాల రామనాథం

**పినపాక, జూన్ 09(పీపుల్స్ డైరీ) :** ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వమే నేరుగా ఇల్లు మంజూరు చేస్తుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు, పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామనాథం స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఇళ్ల మంజూరు పేరుతో దళారులు చేస్తున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. "ఇల్లు ఇప్పిస్తామని చెప్పి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఒక్క రూపాయి కూడా చెల్లించవద్దు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా ప్రభుత్వ నిబంధనలు, అర్హత ప్రమాణాల ప్రకారమే జరుగుతుంది" అని తేల్చిచెప్పారు. దళారుల బెడద ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు లేదా పార్టీ నాయకులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# పేదల సంక్షేమం, అభివృద్దే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## అశ్వారావుపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శ్రీకారం





**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 9 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి అశ్వారావుపేట నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దమ్మపేట మండలంలోని కట్కూరు, వీరభద్రునిగుంపు, పట్వారిగూడెం, మద్దులగూడెం గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. పట్వారిగూడెం గ్రామంలో రాజుపల్లి గ్రామానికి చెందిన 38 మంది డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. అనంతరం రూ.2.22 కోట్ల వ్యయంతో పట్వారిగూడెం ఆర్‌డబీ రోడ్డు నుండి పాకలగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, రూ.1.93 కోట్లతో మొద్దులగూడెం ఆర్ అండ్ బి రోడ్డు నుండి రెడ్డాలపాడు వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా కొమరం భీమ్ అర్బన్ ఎకో పార్క్ నిర్మాణ పనులకు, రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మామిళ్లవారిగూడెం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబి య్యం, కొత్త రేషన్ కార్డులు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కేవలం తొమ్మిది నెలల్లోనే 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల వ్యయంతో రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేసినట్లు తెలిపారు. అశ్వారావుపేట నియోజకవ ర్గానికి ప్రత్యేకంగా 4,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. కుల, మత, పార్టీ భేదాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబా నికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, ప్రతి అర్హుడికి ఇల్లు అందే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలను ఆపకుండా కొనసాగి స్తున్నామని మంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపట్టామని, 99 పాఠశాలల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నా యని తెలిపారు. కొమరం భీమ్ అర్బన్ ఎకో పార్క్ అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు చేశామని, అవసరమైతే మరిన్ని నిధులు కూడా కేటాయి స్తామని చెప్పారు. మారుమూల గిరిజన ప్రాంతాలైన పూసుకుంటలో, కొండ రెడ్లు, గుత్తి కోయలు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు నిర్వహించడం ద్వారా పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకా రం చేసిందన్నారు. అశ్వారావుపేటలో 100 పడకల ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల, ఏటీ సి కళాశాలలను మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణంలో స్థల సమస్య ఉన్నప్పటికీ ఐదు ఎకరాల్లో గ్రౌండ్ ప్లస్ త్రీ విధానంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలు చేపట్టి స్థలం లేని పేదలకు అందజేస్తా మని చెప్పారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, అశ్వారావుపేట మునిసిపల్ చైర్మన్ జూపల్లి శశి కళ, ఆత్మ కమిటీ చైర్మన్, ప్రజాప్రతిని ధులు, నిర్మాణ శాఖ పిడి సావేరామ్,జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతి నిధులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT SATYANARAYANA PRINTERS, H.NO.4-6-144, TILAK ROAD, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA, STATE. PUBLISHED AT H.NO. 10-3-488, OPP: RTC WORK SHOP, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com